ప్రజానేస్తం జ్వాల

నిజం కోసం... నిర్భయంగా...

www.prajanesthamjwalanews.com | prajanesthamnews@gmail.com

నవంబర్ 28 శనివారం 2026 | సంపుటి : 1 | సంచిక : 49 | పేజీలు : 6 | వెల రూ. 4.00/- | ఎడిటర్ : చెన్నగాని పురుషోత్తం

SATURDAY NOVEMBER 28 2026 | VOL:1 | ISSUE: 49 | PAGES:6 | Rs. 4:00 | EDITOR: CHENAGANI PURUSHOTHAM



విదేశీ ఉద్యోగాల కోసం నిరుద్యోగ యువతకు ఆర్థిక చేయూత

- ముఖ్యమంత్రి ఓవర్సీస్ ఎంప్లాయిమెంట్ స్కీమ్‌కు ప్రభుత్వం శ్రీకారం
- తొలి ఏడాది 7 వేల మందికి లబ్ధి చేకూర్చే లక్ష్యం
- వీసా, విమాన ప్రయాణం, భాషా శిక్షణ ఖర్చుల్లో 50 శాతం సబ్సిడీ



అవసరమైన వీసా, విమాన ప్రయాణం, విదేశీ భాషా శిక్షణ ఖర్చుల్లో 50 శాతం సబ్సిడీ అందించనుంది. రెండు కేటగిరీల్లో ఆర్థిక సాయం

విదేశాల్లో ఉద్యోగాలు పొందాలనుకునే నిరుద్యోగ యువతకు ఆర్థిక చేయూత అందించేందుకు తెలంగాణ ప్రభుత్వం కొత్త పథకాన్ని ప్రారంభించనుంది. ముఖ్యమంత్రి ఓవర్సీస్ ఎంప్లాయిమెంట్ స్కీమ్ పేరుతో ఈ కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. పథకం అమలుకు సంబంధించిన మార్గదర్శకాలను ప్రభుత్వం విడుదల చేసింది. తొలి ఏడాదిలో 7 వేల మంది యువతకు లబ్ధి చేకూర్చాలని లక్ష్యంగా నిర్ణయించింది. విదేశీ ఉద్యోగాల కోసం

(మిగతా 2వ పేజీలో..)

నషా ముక్త్ భారత్.. కిషన్ రెడ్డి పాదయాత్రలో డ్రగ్స్‌కు వ్యతిరేకంగా ప్రతిజ్ఞ చేయించిన నాగార్జున

నషా ముక్త్ భారత్.. డ్రగ్స్ కు వ్యతిరేకంగా కేంద్రం జాతీయ కార్యక్రమం

కిషన్ రెడ్డి ఆధ్వర్యంలో హైదరాబాద్ లో పాదయాత్ర

మూడో రోజు యాత్రలో పాల్గొన్న అగ్రనటుడు నాగార్జున

డ్రగ్స్ రహిత భారత్ కోసం ప్రతిజ్ఞ చేయించిన నాగార్జున

యాత్రకు మద్దతు తెలిపిన పలువురు సినీ ప్రముఖులు

ముగింపు వేడుకకు చిరంజీవి, శ్రీశ్రీ రవిశంకర్ హాజరు

మాదకద్రవ్యాల వినియోగానికి వ్యతిరేకంగా కేంద్ర మంత్రి జి. కిషన్ రెడ్డి హైదరాబాద్‌లో చేపట్టిన పాదయాత్రకు సినీ ప్రముఖుల నుంచి విశేష మద్దతు లభిస్తోంది. 'హైదరాబాద్ వాక్స్ ఫర్ నషా ముక్త్ భారత్' పేరుతో మూడు రోజులుగా జరుగుతున్న ఈ

(మిగతా 2వ పేజీలో..)



లోక్‌సభ స్థానాలు 815కు పెంపు.. 2051 దాకా ఫ్రీజ్!: కేంద్ర కేబినెట్ సంచలన ఆమోదం!

- లోక్‌సభ సీట్లు 50 శాతం పెంపు బిల్లుకు కేంద్ర కేబినెట్ ఆమోదం
- దక్షిణాది రాష్ట్రాల దామాషా నిష్పత్తి తగ్గకుండా సమన్యాయం
- నవంబరు 30 నుంచి జరిగే ప్రత్యేక పార్లమెంట్ భేటీలో బిల్లు ప్రవేశం
- కేంద్రం వ్యూహాన్ని అడ్డుకునేందుకు శనివారం ఇండియా కూటమి భేటీ



దేశంలో నియోజకవర్గాల పునర్విభజన (డీలిమిటేషన్), మహిళా రిజర్వేషన్ల చట్టం అమలుపై కేంద్ర ప్రభుత్వం చారిత్రక ముందడుగు వేసింది. శుక్రవారం ప్రధానమంత్రి అధ్యక్షతన సమావేశమైన కేంద్ర మంత్రివర్గం (కేబినెట్) రాజ్యాంగ సవరణ బిల్లుకు ఆమోదం తెలిపింది. ఈ తాజా నిర్ణయం ప్రకారం లోక్‌సభ స్థానాల సంఖ్యను ఏకరీతిగా 50 శాతం పెంచనున్నారు. దీంతో ప్రస్తుతం 543గా ఉన్న లోక్‌సభ సభ్యుల సంఖ్య దాదాపు 815 స్థానాలకు చేరనుంది. అంతేకాకుండా, పెరిగిన ఈ స్థానాల సంఖ్యపై రాబోయే 25 ఏళ్ల పాటు.. అంటే 2051 వరకు ఎలాంటి మార్పు లేకుండా 'ఫ్రీజ్' (స్తంభింపజేయడం) విధించనున్నట్లు సమాచారం. ఈ బిల్లు పూర్తి వివిధానాలు ఇంకా అధికారికంగా వెల్లడి కాలేదు. అయితే అన్ని రాష్ట్రాల ప్రస్తుత దామాషా (ప్రపోర్షనల్ షేర్) ప్రాతినిధ్యం మారకుండా యథాతథంగా కొనసాగించాలని కేంద్రం భావిస్తోంది. జనాభా ఆధారంగా డీలిమిటేషన్ చేస్తే జనాభాను నియంత్రించిన దక్షిణాది రాష్ట్రాలకు సీట్లు తగ్గి అన్యాయం జరుగుతుందన్న ఆందోళనలు తీవ్రంగా ఉన్నాయి. డీఎంకే వంటి విపక్ష పార్టీలు ఈ అంశాన్ని బలంగా లేవనెత్తాయి. వీటికి చెక్ పెట్టేందుకే అన్ని రాష్ట్రాల్లో సమానంగా 50 శాతం సీట్లు పెంచే ఫార్ములాను కేంద్రం తెరపైకి తెచ్చింది. తద్వారా దక్షిణాది రాష్ట్రాల ప్రాధాన్యత తగ్గకుండా కాపాడవచ్చని ప్రభుత్వం భావిస్తోంది.నవంబరు 30 నుంచి డిసెంబరు 3 వరకు పార్లమెంట్ ప్రత్యేక సమావేశాలు జరగనున్నాయి.

మహిళలకు 33 శాతం రిజర్వేషన్ ఖాయం.. కాంగ్రెస్ ఆపలేదు: అమిత్ షా

- మహిళా కోటాను కాంగ్రెస్, రాహుల్ ఆపలేరని వ్యాఖ్య
- బీజేపీ పాలిత రాష్ట్రాల్లో ఉమ్మడి పౌరస్మృతి అమలు ఖాయమన్న షా
- నవంబరు 30 నుంచి పార్లమెంట్ శీతాకాల సమావేశాలు
- 18 నెలల ఎమర్జెన్సీతో రాజ్యాంగాన్ని బంధించింది కాంగ్రెస్సేనని ధ్వజం

పార్లమెంట్, అసెంబ్లీలలో మహిళలకు 33 శాతం రిజర్వేషన్లు కల్పించే ప్రక్రియను కాంగ్రెస్ పార్టీ గానీ, ఆ పార్టీ అగ్రనేత రాహుల్ గాంధీ గానీ ఏమాత్రం ఆపలేరని కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షా స్పష్టం చేశారు. దేశంలోని మహిళలకు కచ్చితంగా 33 శాతం రిజర్వేషన్లు అందుతాయని, ప్రధాని నరేంద్ర మోదీ నాయకత్వంలోని బీజేపీ వారికి రాజకీయ ప్రాతినిధ్యం కల్పించేందుకు పూర్తిగా కట్టుబడి ఉందని ఉద్ఘాటించారు. ఢిల్లీలో నిర్వహించిన 'సంవిధాన్ గౌరవ్ దివస్' కార్యక్రమంలో ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు.గత ఏప్రిల్‌లో 2011 జనాభా లెక్కల

(మిగతా 2వ పేజీలో..)



నేను ఇక్కడే ఉన్నా.. దమ్ముంటే పట్టుకోండి: పోలీసులకు అభిజిత్ దీపేక్ సవాల్

పోలీసుల లుకౌట్ నోటీసులపై బహిరంగంగా స్పందించిన సీజేపీ అధినేత అభిజిత్ దీపేక్

నాగ్‌పూర్ నిరసన సభలో పోలీసులకు అరెస్ట్ సవాల్ విసిరిన వైనం

కేంద్ర ప్రభుత్వం రాజ్యాంగానికి వ్యతిరేకంగా పనిచేస్తోందని ఆరోపణ

తనపై ముంబై పోలీసులు లుకౌట్ నోటీసులు జారీ చేయడంపై కాక్రోచ్ జనతా పార్టీ (సీజేపీ) వ్యవస్థాపకుడు అభిజిత్ దీపేక్ తీవ్రంగా స్పందించారు. మహారాష్ట్రలోని నాగ్‌పూర్ సంవిధాన్ చౌక్‌లో జరిగిన 'ప్రజాస్వామ్యాన్ని కాపాడండి, రాజ్యాంగాన్ని కాపాడండి' నిరసన ర్యాలీలో ఆయన మాట్లాడారు. తాను ఎక్కడికీ పారిపోలేదని, దమ్ముంటే తనను అరెస్ట్ చేయాలంటూ అక్కడే ఉన్న పోలీసులకు బహిరంగ సవాల్ విసిరారు.బహిరంగ సభలో అభిజిత్ దీపేక్ మాట్లాడుతూ... "నాపై ముంబై పోలీసులు లుకౌట్ నోటీస్ జారీ చేశారు. ఇక్కడ పోలీస్ బందోబస్తు ఉంది. వారు నా కోసం వెతుకుతున్నారు. నేను ఇక్కడే సంవిధాన్ చౌక్‌లో ఉన్నాను. నన్ను అరెస్ట్ చేయండి. నేను రెండుసార్లు జైలుకు వెళ్లాను. నాకు జైలు భయాన్ని చూపించాలనుకోకండి.. నాకు కొత్తేం కాదు" అని అన్నారు.కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం రాజ్యాంగానికి వ్యతిరేకంగా వ్యవహరిస్తోందని, దేశంలోని ప్రతి వ్యవస్థను హైజాక్ చేసిందని ఆయన ఆరోపించారు. ప్రజలు 12 ఏళ్లుగా భయంతో బతికారని, అయితే జంతర్

(మిగతా 2వ పేజీలో..)



డీఎంకే, బీజేపీ పొత్తుకు సిద్ధమవుతున్నాయన్న టీవీకే.. కౌంటర్ ఇచ్చిన డీఎంకే

- గవర్నర్‌తో ఉదయనిధి భేటీపై టీవీకే ఆరోపణలు
- మహిళా కలెక్టర్ వేధింపుల అంశంపై సీబీఐ విచారణ కోసమే గవర్నర్‌ను కలిశామన్న డీఎంకే
- నియోజకవర్గాల పునర్విభజన బిల్లుపై పార్టీ అధ్యక్షుడు స్టాలిన్ నిర్ణయం తీసుకుంటారన్న నేతలు

తమిళనాడులో ప్రధాన ప్రతిపక్షమైన డీఎంకే కేంద్రంలోని అధికార బీజేపీతో పొత్తు పెట్టుకోవడానికి సిద్ధమవుతోందని రాష్ట్ర ముఖ్యమంత్రి విజయ్ నేతృత్వంలోని తమిళగ

(మిగతా 2వ పేజీలో..)



భారత్-అమెరికా వాణిజ్య ఒప్పందం తుది దశలో ఉంది: పీయూష్ గోయల్

- ఇరుదేశాల దీర్ఘకాల సమస్యలు పరిష్కార దిశగా అడుగులు
- 2026 సమ్మిట్‌లో కేంద్ర మంత్రి పీయూష్ గోయల్ ప్రకటన
- ఈయూతో ఒప్పందం కూడా వచ్చే ఏడాది నుంచే అమలు
- అమెరికా ప్రతిపాదించిన 25 శాతం సుంకాల వేళ కీలక ప్రకటన



భారత్, అమెరికా మధ్య ద్వైపాక్షిక వాణిజ్య ఒప్పందం తుది దశకు చేరుకుందని కేంద్ర వాణిజ్య, పరిశ్రమల శాఖ మంత్రి పీయూష్ గోయల్ వెల్లడించారు. ఒప్పంద విధివిధానాలు, అమలు ప్రక్రియలో ఇన్నాళ్లూ ఎదురైన అడ్డంకులు తొలగిపోతున్నాయని చెప్పారు. వర్చువల్ విధానంలో నిర్వహించిన 'ఇండియా

(మిగతా 2వ పేజీలో..)

ప్రజానేస్తం జ్వాల
నిజం కోసం... నిర్భయంగా...
www.prajanesthamjwalanews.com | prajanesthamnews@gmail.com

సంపాదకీయం

తినే తిండిలోనూ కల్తీనా?

లాభాల వేటలో ప్రజారోగ్యంతో చెలగాటం.. ఆహార భద్రతపై కఠిన నిఘా అవసరం

మనిషికి ఆహారం ప్రాథమిక అవసరం. ఆరోగ్యంగా జీవించాలంటే స్వచ్ఛమైన, పోషక విలువలున్న ఆహారం తీసుకోవాలి. కానీ నేటి పరిస్థితుల్లో మనం తింటున్న ఆహారం నిజంగా నాణ్యమైనదేనా? కొనుగోలు చేస్తున్న పాలు, నూనెలు, పప్పులు, మసాలా దినుసులు, తినుబండారాల్లో కల్తీ లేదని నమ్మగలమా? అన్న సందేహాలు ప్రజలను వెంటాడుతున్నాయి. అధిక లాభాల కోసం కొందరు వ్యాపారులు నాణ్యతకు తిలోదకాలిస్తూ ప్రజల ఆరోగ్యంతో చెలగాటమాడుతున్నారు. ఆహారం ద్వారా వ్యాధులు వ్యాపించే ప్రమాదం ఉన్నప్పటికీ, కల్తీ నిరోధక చర్యలు ఆశించిన స్థాయిలో కనిపించడం లేదు.

లాభాల కోసం ప్రమాదకర పద్ధతులు

కొన్ని చోట్ల పాలలో ఇతర పదార్థాలు కలపడం, వంట నూనెల్లో నాసిరకం నూనెలు కల్తీ చేయడం, మసాలా దినుసుల్లో రంగులు, నిషేధిత పదార్థాలు కలపడం వంటి అక్రమాలు జరుగుతున్నాయనే ఫిర్యాదులు వస్తున్నాయి. తక్కువ ధరకు ముడిసరుకు కొనుగోలు చేసి, ఆకర్షణీయమైన ప్యాకింగ్‌తో అధిక ధరలకు విక్రయించడం మరో సమస్య. ముఖ్యంగా చిన్నపిల్లలు, వృద్ధులు, అనారోగ్యంతో ఉన్నవారు కల్తీ ఆహారం వల్ల ఎక్కువగా ప్రభావితమయ్యే ప్రమాదం ఉంది. ఆహార నాణ్యతపై రాజీ పడటం అంటే ప్రజల ప్రాణాలతో చెలగాటమాడటమే.

ఆకర్షణీయమైన ప్యాకింగ్.. లోపల నాణ్యతపై సందేహాలు

సూపర్ మార్కెట్లు, ఆన్‌లైన్ విక్రయ వేదికలు, వీధి వ్యాపారాలు.. ఇలా ఆహార ఉత్పత్తులు అనేక మార్గాల్లో ప్రజలకు చేరుతున్నాయి. రంగురంగుల ప్యాకెట్లు, ఆకర్షణీయమైన ప్రకటనలు చూసి వినియోగదారులు వస్తువులను కొనుగోలు చేస్తున్నారు. కానీ ప్యాకింగ్ బాగున్నంత మాత్రాన ఆహారం నాణ్యమైనదని భావించకూడదు. తయారీ తేదీ, గడువు తేదీ, పదార్థాల వివరాలు, నిల్వ విధానం, ఆహార భద్రత లైసెన్స్ వంటి అంశాలను పరిశీలించాలి. తక్కువ ధరకు లభిస్తోందని తెలియని ఉత్పత్తులను కొనుగోలు చేయడం ప్రమాదకరం.

తనిఖీలు కాగితాలకే పరిమితం కాకూడదు

ఆహార భద్రతకు సంబంధించిన చట్టాలు ఉన్నప్పటికీ వాటి అమలు సమర్థంగా ఉండాలి. ఆహార భద్రత, ప్రమాణాల చట్టం--2006 ప్రకారం నిబంధనలు ఉల్లంఘించే వారిపై చర్యలు తీసుకునే అవకాశం ఉంది. అయితే కేవలం పండుగల సమయంలో లేదా కల్తీ ఘటనలు వెలుగులోకి వచ్చినప్పుడే తనిఖీలు నిర్వహించడం సరిపోదు. తయారీ కేంద్రాలు, గోదాములు, హోటళ్లు, రెస్టారెంట్లు, వీధి ఆహార విక్రయ కేంద్రాల్లో నిరంతర తనిఖీలు జరగాలి. అనుమానాస్పద నమూనాలను సేకరించి ప్రయోగశాలల్లో పరీక్షించాలి. నిబంధనలు ఉల్లంఘించిన సంస్థలపై చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకోవాలి.

వినియోగదారుల అప్రమత్తత కూడా అవసరం

ప్రభుత్వాలు, అధికారులు చర్యలు తీసుకోవడంతో పాటు ప్రజలు కూడా అప్రమత్తంగా ఉండాలి. పాడైన వాసన, రంగు లేదా రుచి కనిపించే ఆహారాన్ని వినియోగించకూడదు. నాణ్యతపై అనుమానం ఉంటే సంబంధిత అధికారులకు ఫిర్యాదు చేయాలి. కొనుగోలు చేసిన వస్తువుల రశీదులు, ప్యాకింగ్ వివరాలు భద్రపరచుకోవాలి. ఆహార కల్తీపై ఫిర్యాదులు చేయడానికి ఫుడ్ సేఫ్టీ అండ్ స్టాండర్డ్స్ అథారిటీ ఆఫ్ ఇండియా (ఎఫ్ఎస్ఎస్ఏఐ) అందించే అధికారిక మార్గాలను వినియోగించుకోవాలి. సమస్యను గుర్తించినా మౌనంగా ఉండటం వల్ల కల్తీ వ్యాపారులకు మరింత అవకాశం ఇచ్చినట్లవుతుంది.

స్వచ్ఛమైన ఆహారం హక్కు.. వ్యాపారుల బాధ్యత

ఆహారం విక్రయించడం కేవలం వ్యాపారం మాత్రమే కాదు.. ప్రజల ఆరోగ్యానికి సంబంధించిన బాధ్యత కూడా. వ్యాపారులు నాణ్యతా ప్రమాణాలను పాటించాలి. తయారీ నుంచి నిల్వ, రవాణా, విక్రయం వరకు ప్రతి దశలో పరిశుభ్రతను కాపాడాలి. తక్కువ ధరకు ఉత్పత్తులు అందించాలనే పేరుతో నాణ్యతను తగ్గించకూడదు. ప్రభుత్వం తనిఖీలను బలోపేతం చేయడంతో పాటు ఆహార పరీక్షా ప్రయోగశాలల సామర్థ్యాన్ని పెంచాలి. కల్తీని గుర్తించినప్పుడు చర్యలు వేగంగా, పారదర్శకంగా ఉండాలి.

ఆరోగ్యమే సంపద.. దానితో వ్యాపారం వద్దు

ప్రజలు కష్టపడి సంపాదించిన డబ్బుతో కొనుగోలు చేసే ఆహారం వారికి ఆరోగ్యాన్ని అందించాలి కానీ అనారోగ్యాన్ని మిగల్చకూడదు. కల్తీని అరికట్టడం ఒక్క శాఖ బాధ్యత కాదు. అధికారులు, వ్యాపారులు, వినియోగదారులు సమిష్టిగా బాధ్యత తీసుకోవాలి.

నేను ఇక్కడే ఉన్నా.. దమ్ముంటే పట్టుకోండి: పోలీసులకు అభిజిత్ దీప్కే సవాల్

మొదటి పేజీ తరువాయి)

మంతర్ వద్ద జరిగిన నిరసన ప్రజలకు మళ్లీ గొంతుకను ఇచ్చిందని పేర్కొన్నారు. మరో రెండేళ్లపాటు ఎంత భయాన్ని సృష్టించుకుంటారో సృష్టించుకోవాలని, 2029 సమీపిస్తోందని హెచ్చరించారు. ఇదే కార్యక్రమంలో లుకౌట్ నోటీసులు ఎదుర్కొంటున్న మరో సీజేపీ నేత అశుతోష్ రాంకా కూడా ప్రసంగించారు. "రాజ్యాంగాన్ని కాపాడుకోలేకపోతే, దేశాన్ని కూడా కాపాడుకోలేం" అని ఆయన అన్నారు.

భారత్-అమెరికా వాణిజ్య ఒప్పందం తుది దశలో ఉంది: పీయూష్ గోయల్

డెట్ క్యాపిటల్ మార్కెట్ సమ్మిట్ 2026' సదస్సులో ఆయన ఈ కీలక వ్యాఖ్యలు చేశారు.ఇరు దేశాల మధ్య ప్రతిపాదిత వాణిజ్య ఒప్పందం అతి త్వరలోనే ఒక కొలిక్కి రానుందని గోయల్ స్పష్టం చేశారు. చర్చల్లో కీలకమైన ముందడుగు పడిందని తెలిపారు. ఇరు దేశాల ప్రయోజనాలకు అనుగుణంగా ఒప్పందం సిద్ధమవుతోందని వివరించారు.భారత ఆర్థిక ప్రగతిని గోయల్ కొనియాడారు. జీఎస్టీ వ్యవస్థను సులభతరం చేస్తూనే పన్ను రేట్లను అందుబాటులో ఉంచామని గుర్తుచేశారు. ఇటీవల జీఎస్టీ వసూళ్లు ఆల్‌టైమ్ రికార్డును నమోదు చేశాయని చెప్పారు. ఒకే నెలలో ఎగుమతులు 90 బిలియన్ డాలర్లకు చేరడం దేశ చరిత్రలోనే ఓ మైలురాయి అని పేర్కొన్నారు.యూరోపియన్ యూనియన్‌తో కూడా వాణిజ్య ఒప్పందంపై చర్చలు ముగింపునకు వచ్చాయని తెలిపారు. ఈ ఏడాది చివరి నాటికి యూరోపియన్ యూనియన్ ఒప్పందం ఖరారవుతుందని చెప్పారు. వచ్చే ఏడాది మార్చి లేదా ఏప్రిల్ నాటికి అది అమల్లోకి వచ్చే అవకాశముందని అంచనా వేశారు. ఈ ఒప్పందాల ద్వారా భారతీయ ఎగుమతిదారులకు అంతర్జాతీయ మార్కెట్లలో భారీ అవకాశాలు దక్కుతాయని ధీమా వ్యక్తం చేశారు. భారత వస్తువులపై 25 శాతం వరకు సుంకాలు విధించాలని అమెరికా వాణిజ్య విభాగం ఇటీవల ప్రతిపాదించిన విషయం తెలిసిందే. ద్వైపాక్షిక వాణిజ్య ఒప్పందం కుదిరితే ఆ సుంకాలను 17 శాతానికి తగ్గించే అవకాశం ఉందని అమెరికా సంకేతాలిచ్చింది. భారత్ తయారీ రంగంలో మితిమీరిన సామర్థ్యం ఉందన్న ఆరోపణలను కేంద్రం ఇప్పటికే తోసిపుచ్చింది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలోని తొలి ఏడు నెలల్లో అమెరికాకు భారత ఎగుమతులు 59.52 బిలియన్ డాలర్లకు పెరిగాయి. ఇప్పటికీ అమెరికానే భారత్‌కు అతిపెద్ద ఎగుమతి మార్కెట్‌గా కొనసాగుతోంది.

విదేశీ ఉద్యోగాల కోసం నిరుద్యోగ యువతకు ఆర్థిక చేయూత

మొదటి పేజీ తరువాయి)

ఈ పథకం కింద రెండు కేటగిరీలుగా ఆర్థిక సాయం అందించనున్నారు. మొదటి కేటగిరీకి గరిష్ఠంగా రూ.50 వేల వరకు, రెండో కేటగిరీకి గరిష్ఠంగా రూ.1.75 లక్షల వరకు సబ్సిడీ ఇవ్వనున్నారు. 18 నుంచి 40 ఏళ్ల మధ్య వయసున్న నిరుద్యోగ యువత ఈ పథకానికి అర్హులుగా ప్రభుత్వం నిర్ణయించింది. ఆర్థికంగా వెనుకబడిన కుటుంబాలకు చెందిన యువతకు ప్రాధాన్యం కల్పించనుంది.

మహిళలు, దివ్యాంగులకు ప్రత్యేక రిజర్వేషన్లు

పథకంలో మహిళలకు 33.33 శాతం, దివ్యాంగులకు 5 శాతం రిజర్వేషన్లు కల్పించాలని ప్రభుత్వం నిర్ణయించింది. విదేశీ ఉద్యోగాల కోసం ప్రయత్నించే అర్హులైన యువతకు ఈ అవకాశాలను అందుబాటులోకి తీసుకురానుంది. ఒక రేషన్ కార్డుపై ఒక కుటుంబానికి చెందిన ఒక్కరికి మాత్రమే సబ్సిడీ వర్తిస్తుందని మార్గదర్శకాల్లో స్పష్టం చేసింది.

పది రంగాల్లో విదేశీ ఉద్యోగావకాశాలు

నిర్మాణం, తయారీ, ఆటోమొబైల్, వైద్య, హోటళ్లతో పాటు మొత్తం పది రంగాల్లో విదేశీ ఉద్యోగావకాశాలు కల్పించేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టనుంది. ఆయా ఉద్యోగాలకు అవసరమైన విదేశీ భాషా పరిజ్ఞానం, నైపుణ్య శిక్షణను టామ్‌కామ్ అందించనుంది. ఉద్యోగాలకు అవసరమైన శిక్షణతో యువతను సిద్ధం చేయడం ఈ పథకంలో భాగంగా ఉండనుంది.

ప్రత్యేక పోర్టల్‌లో ఆన్‌లైన్ దరఖాస్తులు

ఈ పథకానికి సంబంధించిన దరఖాస్తులను టామ్‌కామ్ ప్రత్యేక పోర్టల్ ద్వారా ఆన్‌లైన్‌లో స్వీకరించనున్నట్లు ప్రభుత్వం వెల్లడించింది. అర్హతలు, సబ్సిడీ వివరాలు, దరఖాస్తు విధానానికి సంబంధించిన మార్గదర్శకాల ప్రకారం యువత దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుంది. విదేశాల్లో ఉపాధి అవకాశాలను అందిపుచ్చుకునేందుకు ఆర్థికంగా వెనుకబడిన నిరుద్యోగ యువతకు ఈ పథకం తోడ్పడనుంది.

నషా ముక్త్ భారత్.. కిషన్ రెడ్డి పాదయాత్రలో డ్రగ్స్‌కు వ్యతిరేకంగా ప్రతిజ్ఞ చేయించిన నాగార్జున

మొదటి పేజీ తరువాయి)

యాత్ర చివరి రోజైన శుక్రవారం, ప్రముఖ నటుడు నాగార్జున అక్కినేని పాల్గొన్నారు. ఈ సందర్భంగా డ్రగ్స్ రహిత సమాజం కోసం ఆయన ప్రజలతో ప్రతిజ్ఞ చేయించారు.అంబర్‌పేట్‌లో ప్రారంభమైన ఈ పాదయాత్ర ముగింపు రోజున అమీర్‌పేట వద్ద నాగార్జున జత కలిశారు. ఆయనతో పాటు నటుడు సాయికుమార్, దర్శకుడు బోయపాటి శ్రీను, హాస్యనటుడు శివారెడ్డి కూడా ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా నాగార్జున మాట్లాడుతూ, ప్రధానమంత్రి నరేంద్ర మోదీ సంకల్పించిన 'నషా ముక్త్ భారత్' లక్ష్యానికి అనుగుణంగా ఈ యాత్ర జరగడం అభినందనీయమన్నారు. ఈ బృహత్ కార్యక్రమంలో సమాజంలోని అన్ని వర్గాల ప్రజలు భాగస్వాములు కావాలని ఆయన పిలుపునిచ్చారు."వ్యక్తిగతంగా నేను డ్రగ్స్‌కు దూరంగా ఉండటమే కాకుండా, నా కుటుంబాన్ని, స్నేహితులను, చుట్టూ ఉన్న సమాజాన్ని కూడా డ్రగ్స్ బారిన పడకుండా కాపాడేందుకు అన్ని విధాలా ప్రయత్నిస్తాను" అని నాగార్జున ప్రతిజ్ఞ చేయించారు. నటుడు సాయికుమార్ 'నషా ముక్త్ భారత్ - మేం చేసి తీరుతాం' అంటూ నినాదాలతో హోరెత్తించారు. ఈ సందర్భంగా కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి మాట్లాడుతూ, ఢిల్లీలో అత్యవసర కేబినెట్ సమావేశం ఉన్నప్పటికీ, పాదయాత్రను కొనసాగించాలని ప్రధానమంత్రి తనకు సూచించారని తెలిపారు. ప్రజల నుంచి యాత్రకు అద్భుతమైన స్పందన వస్తోందన్నారు. జూబ్లీహిల్స్‌లో జరిగే ముగింపు కార్యక్రమానికి మెగాస్టార్ చిరంజీవి, ఆర్ట్ ఆఫ్ లివింగ్ వ్యవస్థాపకుడు శ్రీశ్రీ రవిశంకర్ హాజరవుతారని వెల్లడించారు. 'నషా ముక్త్ భారత్ అభియాన్'లో భాగంగా జరుగుతున్న ఈ కార్యక్రమంలో ఇప్పటికే బ్యాడ్మింటన్ కోచ్ పుల్లెల గోపీచంద్ వంటి ప్రముఖులు కూడా పాల్గొని తమ మద్దతు తెలిపారు. యువతను మాదకద్రవ్యాల మహమ్మారి నుంచి రక్షించడానికి సామూహిక బాధ్యతతో పనిచేయాలని నిర్వాహకులు పిలుపునిచ్చారు.

లోక్‌సభ స్థానాలు 815కు పెంపు.. 2051 దాకా ఫ్రీజ్!: కేంద్ర కేబినెట్ సంచలన ఆమోదం!

మొదటి పేజీ తరువాయి)

ఈ సమావేశాల్లోనే డీలిమిటేషన్, చట్టసభల్లో మహిళలకు 33 శాతం రిజర్వేషన్ కల్పించే బిల్లును ప్రభుత్వం సభ ముందుకు తీసుకురానుంది. పార్లమెంటరీ వ్యవహారాల మంత్రి కిరణ్ రిజిజు మాట్లాడుతూ.. సభలో అత్యంత కీలక అంశాలపై చర్చ జరగనుందని, విపక్షాలు అనవసర వ్యాఖ్యలు మానుకోవాలని సూచించారు. గత ఏప్రిల్‌లో అవసరమైన మూడింట రెండొంతుల మెజారిటీ లేకపోవడంతో ఈ బిల్లు వీగిపోయిన సంగతి తెలిసిందే. కేంద్రం తాజా ఎత్తుగడపై విపక్ష శిబిరంలో తీవ్ర చర్చ మొదలైంది. సమాజ్‌వాదీ పార్టీ అధినేత అఖిలేశ్ యాదవ్ ఈ నిర్ణయంపై మండిపడ్డారు. ఇది 'భాజపా చేసిన అతిపెద్ద తప్పు' అని, ఉత్తర్‌ప్రదేశ్‌లో ఎన్నికల లబ్ధి కోసమే ఇలా చేస్తున్నారని ఆరోపించారు. మరోవైపు, డీలిమిటేషన్ బిల్లును అడ్డుకునేందుకు 'ఇండియా' కూటమి ఉమ్మడి వ్యూహం రచిస్తోంది. కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే నివాసంలో శనివారం ఉదయం 11 గంటలకు విపక్ష పార్టీల నేతల అత్యవసర సమావేశం జరగనుంది.

మహిళలకు 33 శాతం రిజర్వేషన్ ఖాయం.. కాంగ్రెస్ ఆపలేదు: అమిత్ షా

మొదటి పేజీ తరువాయి)

ఆధారంగా నియోజకవర్గాల పునర్విభజన చేపట్టి, మహిళా కోటాను వేగవంతం చేసేందుకు తీసుకొచ్చిన 131వ రాజ్యాంగ సవరణ బిల్లును విపక్షాలు అడ్డుకున్నాయని అమిత్ షా మండిపడ్డారు. నవంబరు 30న పార్లమెంట్ శీతాకాల సమావేశాలు ప్రారంభం కానున్న వేళ ఆయన ఈ ప్రకటన చేయడం ప్రాధాన్యం సంతరించుకుంది. కేవలం రాజ్యాంగ పుస్తకాన్ని చేతిలో పట్టుకుని ప్రదర్శించినంత మాత్రాన రాజ్యాంగాన్ని గౌరవించినట్లు కాదని రాహుల్ గాంధీని ఉద్దేశించి విమర్శించారు. రాజ్యాంగ విలువల పట్ల నిబద్ధత ప్రవర్తనలో కనిపించాలని, న్యాయస్థానాలు, ఎన్నికల సంఘం లాంటి వ్యవస్థలను కించపరచడం కాంగ్రెస్‌కే చెల్లిందని దుయ్యబట్టారు. గతంలో అత్యవసర పరిస్థితి (ఎమర్జెన్సీ) విధించి 18 నెలల పాటు రాజ్యాంగాన్ని చెరబట్టిన చరిత్ర ఆ పార్టీదేనని ఎద్దేవా చేశారు.బీజేపీ పాలిత రాష్ట్రాలన్నింటిలో త్వరలోనే యూనిఫామ్ సివిల్ కోడ్ (యూసీసీ) అమలు చేసి తీరుతామని హోం మంత్రి స్పష్టం చేశారు. రాజ్యాంగ రూపకర్తలు నిర్దేశక సూత్రాల్లోనే ఉమ్మడి పౌరస్మృతిని చేర్చారని గుర్తుచేశారు. మతంతో సంబంధం లేకుండా హిందూ, ముస్లిం, సిక్కు, క్రైస్తవ, పార్సీ పౌరులందరికీ ఒకే చట్టం వర్తించేలా చర్యలు తీసుకుంటామన్నారు. మోదీ పాలనలో ఆర్టికల్ 370 రద్దు, వామపక్ష తీవ్రవాదం అణచివేత, ఈశాన్య రాష్ట్రాల్లో 11 వేల మంది సాయుధుల లొంగుబాటుతో దేశ సమగ్రత బలపడిందని తెలిపారు. సంక్షేమ పథకాల ద్వారా 80 కోట్ల మంది పేదలకు లబ్ధి చేకూర్చామని వివరించారు.

డీఎంకే, బీజేపీ పొత్తుకు సిద్ధమవుతున్నాయన్న టీవీకే.. కౌంటర్ ఇచ్చిన డీఎంకే

మొదటి పేజీ తరువాయి)

వెట్రి కళగం (టీవీకే) పార్టీ ఆరోపించింది. అయితే ఈ ఆరోపణల్లో ఎలాంటి నిజం లేదని, తాము బీజేపీతో జట్టు కట్టే ప్రసక్తే లేదని డీఎంకే స్పష్టం చేసింది. పార్లమెంట్‌లో నియోజకవర్గాల పునర్విభజన (డీలిమిటేషన్) బిల్లుపై చర్చ జరగనున్న తరుణంలో ఈ రాజకీయ పరిణామాలు ప్రాధాన్యతను సంతరించుకున్నాయి. నవంబర్ 30 నుంచి డిసెంబర్ 3 వరకు పార్లమెంట్ ప్రత్యేక సమావేశాలు జరగనున్న సంగతి తెలిసిందే. గత ఏప్రిల్‌లో మూడింట రెండు వంతుల మెజారిటీ లేక ఆగిపోయిన పునర్విభజన బిల్లును కేంద్ర ప్రభుత్వం మళ్లీ సభ ముందుకు తెచ్చే అవకాశం ఉంది. ఈ నేపథ్యంలో, డీఎంకే నేత, అసెంబ్లీ ప్రతిపక్ష నాయకుడు ఉదయనిధి స్టాలిన్ తమిళనాడు గవర్నర్ రాజేంద్ర విశ్వనాథ్ ఆర్లేకర్‌తో ఇటీవల భేటీ అయ్యారు. అలాగే డీఎంకే అధికారిక పత్రిక 'మురసోలి'లో బీజేపీ నేతకు సంబంధించిన అంశం ప్రచురితమైంది. వీటిని ప్రస్తావిస్తూ టీవీకే ఐటీ విభాగం సామాజిక మాధ్యమాల్లో తీవ్ర విమర్శలు చేసింది. డీఎంకే తన పాత సిద్ధాంతాలను వదిలిపెట్టి బీజేపీకి దగ్గరవుతోందని ఆరోపించింది. ఈ అంశంపై డీఎంకే అధికార ప్రతినిధి సయ్యద్ హఫీజుల్లా మాట్లాడుతూ... టీవీకే చేసిన వ్యాఖ్యలను తోసిపుచ్చారు. తమ పార్టీ బీజేపీతో పొత్తు దిశగా అడుగులు వేయడం లేదని స్పష్టం చేశారు. ఒక మహిళా కలెక్టర్‌ను లైంగికంగా వేధించారనే ఆరోపణలు ఎదుర్కొంటున్న టీవీకే ఎమ్మెల్యే సి. అరుణ్ విఘ్నేశ్ పై సీబీఐ దర్యాప్తు జరిపించాలని కోరేందుకే ఉదయనిధి స్టాలిన్ గవర్నర్‌ను కలిశారని చెప్పారు. రాష్ట్ర ప్రభుత్వ దర్యాప్తుపై నమ్మకం లేనప్పుడు రాజ్యాంగబద్ధమైన గవర్నర్‌ను కలిసి వినతిపత్రం ఇవ్వడం ప్రతిపక్షంగా తమ బాధ్యత అని ఆయన వివరించారు.పునర్విభజన బిల్లుపై డీఎంకే తన విధానాన్ని మరోసారి స్పష్టం చేసింది. జనాభా ప్రాతిపదికన జరిగే పునర్విభజన వల్ల పార్లమెంట్‌లో తమిళనాడుకు ప్రస్తుతం ఉన్న 7.2 శాతం ప్రాతినిధ్యం తగ్గకూడదని తెలిపింది. ఒకవేళ కేంద్రం తమ డిమాండ్‌ను పరిగణనలోకి తీసుకుంటే బిల్లుకు మద్దతు ఇస్తారా? అన్న ప్రశ్నకు డీఎంకే ప్రతినిధి స్పష్టమైన సమాధానం ఇవ్వలేదు. బిల్లు పార్లమెంట్ ముందుకు వచ్చిన తర్వాతే పార్టీ అధినేత ఎంకే స్టాలిన్ తుది నిర్ణయం తీసుకుంటారని సీనియర్ నాయకులు తెలిపారు.అసెంబ్లీ ఎన్నికల అనంతరం కాంగ్రెస్ పార్టీ టీవీకేకు మద్దతు ఇవ్వడంతో డీఎంకే-కాంగ్రెస్ బంధం తెగిపోయింది. ఈ నేపథ్యంలో పార్లమెంట్‌లో డీఎంకే అనుసరించే వైఖరిపై రాజకీయ వర్గాల్లో విస్తృత చర్చ జరుగుతోంది.

ప్రజానేస్తం జ్వాల
నిజం కోసం... నిర్భయంగా...
www.prajanesthamjwalanews.com | prajanesthamnews@gmail.com

వ్యవసాయ కార్మికుల సమస్యలను పరిష్కరించాలి

సూర్యాపేట, నవంబర్ 27 (ప్రజానేస్తం జ్వాల):

వ్యవసాయ కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వెంటనే పరిష్కరించాలని వ్యవసాయ కార్మిక సంఘం సూర్యాపేట జిల్లా ప్రధాన కార్యదర్శి ధూళిపాళ ధనుంజయనాయుడు డిమాండ్ చేశారు.శుక్రవారం సూర్యాపేటలోని సీపీఐ కార్యాలయంలో తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం ముఖ్య నాయకుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం కోట్లాది మంది వ్యవసాయ కార్మికుల సంక్షేమం కోసం సమగ్ర వ్యవసాయ కార్మిక చట్టాన్ని తీసుకురావాలని కోరారు. కేంద్ర ప్రభుత్వం కార్మిక, రైతాంగ ప్రజావ్యతిరేక విధానాలను అవలంబిస్తూ ప్రజలను మోసం చేస్తోందని విమర్శించారు.పోరాడి సాధించుకున్న మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకాన్ని నిర్వీర్యం చేసేందుకు తగిన బడ్జెట్ కేటాయింపులు చేయడం లేదని ఆరోపించారు. పథకం పేరును మార్చి, కొత్త విధానాల ద్వారా కుల, మతాల పేరుతో ప్రజలను విభజించే ప్రయత్నం చేయడం సరికాదన్నారు.దేశంలో ఉపాధి అవకాశాలు తగ్గుతున్నాయని, ప్రభుత్వ రంగ సంస్థలను ప్రైవేటీకరిస్తూ 44 కార్మిక చట్టాలను నాలుగు కార్మిక కోడ్‌లుగా మార్చి కార్మికుల హక్కులకు భంగం కలిగిస్తున్నారని విమర్శించారు. రైతుల ఆందోళనల నేపథ్యంలో రద్దు చేస్తామని ప్రకటించిన మూడు వ్యవసాయ చట్టాలను పరోక్షంగా అమలు చేసేందుకు కేంద్ర ప్రభుత్వం ప్రయత్నిస్తోందని ఆరోపించారు. రాజ్యాంగ హక్కులను కాపాడాల్సిన బాధ్యత ప్రభుత్వాలపై ఉందన్నారు.ఉపాధి హామీ కూలీలు ప్రమాదవశాత్తు మరణిస్తే వారి కుటుంబాలకు రూ.25 లక్షల పరిహారం చెల్లించాలని, సంవత్సరానికి 200 రోజుల పని కల్పించి రోజువారీ కూలీని రూ.700కు పెంచాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలోని అన్ని మున్సిపాలిటీలు, నగరపాలక సంస్థల్లోనూ ఉపాధి హామీ పనులు కల్పించాలని కోరారు.కరువు పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని రేషన్ దుకాణాల ద్వారా 14 రకాల నిత్యావసర వస్తువులు పంపిణీ చేయాలని,



కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు ఇందిరమ్మ ఆత్మీయ భరోసా పథకాన్ని అమలు చేసి వ్యవసాయ కార్మిక కుటుంబాలకు ఏటా రూ.12 వేల ఆర్థిక సహాయం అందించాలని కోరారు. మహిళలకు చేయూత పథకం కింద నెలకు రూ.4 వేల పింఛన్ ఇవ్వాలని డిమాండ్ చేశారు.ఈ సమావేశంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు నీలం నాగభద్రం, సహాయ కార్యదర్శి రావుల సత్యం, బీసీ హక్కుల సాధన సమితి జిల్లా గౌరవాధ్యక్షుడు చిలకరాజు శ్రీను, వెలిది పద్మావతి తదితరులు పాల్గొన్నారు.

ప్రజల విశ్వాసమే విజయానికి చిరునామా.. యూనియన్ బ్యాంక్‌కు 13 ఏళ్లు!

కొత్తకొండ, నవంబర్ 27 (ప్రజానేస్తం జ్వాల):

భీమదేవరపల్లి మండలం కొత్తకొండలోని యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా శాఖ 13వ వార్షికోత్సవ వేడుకలను శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా బ్యాంకు మేనేజర్లు పరమేశ్వర్, రవీందర్‌తో పాటు బ్యాంకు సిబ్బంది, ఖాతాదారులు కలిసి కేక్ కట్ చేసి వార్షికోత్సవ సంబరాలు జరుపుకున్నారు.ఈ సందర్భంగా మేనేజర్లు మాట్లాడుతూ.. గత 13 ఏళ్లుగా బ్యాంకుపై విశ్వాసం ఉంచి తమ సేవలను వినియోగించుకుంటున్న ప్రజలు, రైతులు, ఖాతాదారులకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ప్రజల ఆదరణ, ఖాతాదారుల నమ్మకమే బ్యాంకు ప్రగతికి ప్రధాన బలమని పేర్కొన్నారు.గ్రామీణ ప్రాంత ప్రజలకు మెరుగైన బ్యాంకింగ్ సేవలు అందించడంతో పాటు రైతులు, చిరు వ్యాపారులు, సామాన్య ఖాతాదారులకు అవసరమైన ఆర్థిక సేవలను మరింత చేరువ చేయడమే తమ లక్ష్యమని తెలిపారు. భవిష్యత్తులో కూడా వేగవంతమైన, నాణ్యమైన సేవలు అందిస్తూ ప్రాంత అభివృద్ధిలో భాగస్వాములవుతామని వెల్లడించారు. 13 ఏళ్ల ప్రస్థానాన్ని విజయవంతంగా పూర్తి చేసుకున్న సందర్భంగా బ్యాంకు సిబ్బంది, ఖాతాదారులు ఆనందం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో బ్యాంకు సిబ్బంది,



ఖాతాదారులు పాల్గొన్నారు.

అర్హులకు అండగా ప్రభుత్వ సంక్షేమ చర్యలు

- **ఉచిత సహాయక ఉపకరణాల పంపిణీకి నిర్ధారణ శిబిరం**
- **అర్హులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలి: జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయి**

ముల్కనూర్, నవంబర్ 27 (ప్రజానేస్తం జ్వాల):

అర్హులైన మహిళలు, చిన్నారులు, దివ్యాంగులు, వయోవృద్ధులకు అవసరమైన సహాయక ఉపకరణాలను ఉచితంగా అందించేందుకు ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపడుతోందని హనుమకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయి తెలిపారు. ప్రభుత్వ సంక్షేమ పథకాల ఫలాలు అర్హులైన ప్రతి ఒక్కరికీ చేరాలనే లక్ష్యంతో నిర్ధారణ శిబిరాలను నిర్వహిస్తున్నట్లు ఆమె పేర్కొన్నారు.రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ ఆదేశాల మేరకు శుక్రవారం భీమదేవరపల్లి మండలం ముల్కనూర్‌లోని సాయి గార్డెన్స్‌లో అలింకో సంస్థ సహకారంతో జిల్లా మహిళా, శిశు, దివ్యాంగులు, వయోవృద్ధుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన నిర్ధారణ శిబిరాన్ని కలెక్టర్ ప్రారంభించారు. అనంతరం శిబిరంలో నిర్వహిస్తున్న వైద్య పరీక్షలు, అర్హత నిర్ధారణ ప్రక్రియలను పరిశీలించి సంబంధిత అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. మండలంలోని వివిధ గ్రామాల నుంచి శిబిరానికి వచ్చిన మహిళలు, చిన్నారులు, దివ్యాంగులు, వయోవృద్ధులకు అవసరమైన పరీక్షలు నిర్వహించి, వారి వ్యక్తిగత అవసరాలకు అనుగుణంగా సహాయక ఉపకరణాలు పొందేందుకు అర్హులను గుర్తిస్తున్నట్లు తెలిపారు. అర్హులైన వారు ఈ అవకాశాన్ని తప్పనిసరిగా సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. నిర్ధారణ పరీక్షల్లో అర్హులుగా గుర్తించిన వారికి త్వరలోనే అవసరమైన ఉపకరణాలను ఉచితంగా అందజేసేందుకు చర్యలు తీసుకుంటామని వెల్లడించారు.ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ సేవలను అర్హులైన ప్రతి ఒక్కరూ వినియోగించుకోవాలని, ఎవరూ ఈ అవకాశాన్ని కోల్పోకుండా అధికారులు ప్రత్యేక శ్రద్ధ వహించాలని సూచించారు. శిబిరానికి వచ్చే వారికి ఎలాంటి ఇబ్బందులు కలగకుండా



అవసరమైన ఏర్పాట్లు చేయాలని, అదనపు కౌంటర్లు ఏర్పాటు చేసి పరీక్షల ప్రక్రియను వేగవంతంగా, పారదర్శకంగా నిర్వహించాలని అధికారులను ఆదేశించారు.అర్హుల గుర్తింపు ప్రక్రియలో ఎలాంటి జాప్యం జరగకుండా సమన్వయంతో పనిచేయాలని, శిబిరానికి వచ్చిన ప్రతి ఒక్కరికీ అవసరమైన సహకారం అందించాలని సూచించారు.ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ ప్రమోద్ రెడ్డి, జడ్పీ డిప్యూటీ సీఈవో శ్రీనివాసరావు, జిల్లా సంక్షేమ అధికారి విశ్వజ, మండల ప్రత్యేక అధికారి కమలాకర్ రెడ్డి, తహసీల్దార్ రాజేష్, ఎంపీడీవో వీరేశం, సీడీపీవోలు స్వరూప, సింధురాణి, ఎఫ్ఆర్‌వో రవికృష్ణ, ఇతర అధికారులు, అలింకో సంస్థ ప్రతినిధులు పాల్గొన్నారు..

జిల్లాలోని సమస్యల పరిష్కారానికి మంత్రి అజహరుద్దీన్‌కు వినతి

ఆసిఫాబాద్, నవంబర్ 27 (ప్రజానేస్తం జ్వాల):

కొమురం భీమ్ ఆసిఫాబాద్ జిల్లాలో నెలకొన్న పలు సమస్యలను పరిష్కరించాలని కోరుతూ కాంగ్రెస్ పార్టీ మైనారిటీ విభాగం జిల్లా నాయకులు రాష్ట్ర మైనారిటీ సంక్షేమ శాఖ మంత్రి మహమ్మద్ అజహరుద్దీన్‌ను కలిసి వినతిపత్రం సమర్పించారు.ఈ సందర్భంగా జిల్లాలో మైనారిటీలు ఎదుర్కొంటున్న సమస్యలతో పాటు వివిధ అభివృద్ధి, సంక్షేమ అంశాలను మంత్రి దృష్టికి తీసుకెళ్లినట్లు నాయకులు తెలిపారు. ఆయా సమస్యలను పరిశీలించి పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని కోరారు.వినతిపై స్పందించిన మంత్రి మహమ్మద్ అజహరుద్దీన్ సమస్యల పరిష్కారానికి సంబంధిత శాఖల అధికారులతో మాట్లాడి అవసరమైన ఆదేశాలు జారీ చేస్తానని హామీ ఇచ్చినట్లు నాయకులు వెల్లడించారు.అనంతరం కొమురం భీమ్ ఆసిఫాబాద్ జిల్లాలో పర్యటించి స్థానికంగా ఉన్న సమస్యలను పరిశీలించాలని జిల్లా కాంగ్రెస్ మైనారిటీ విభాగం అధ్యక్షుడు అర్షద్ హుస్సేన్, జనరల్ సెక్రటరీ షేక్ కలీమ్ మంత్రిని కోరారు. ఇందుకు మంత్రి సానుకూలంగా స్పందించినట్లు వారు తెలిపారు.మంత్రి హామీతో జిల్లాలోని సమస్యల పరిష్కారంపై ఆశాభావం వ్యక్తం చేసిన కాంగ్రెస్ మైనారిటీ విభాగం నాయకులు, త్వరలో జిల్లా పర్యటన చేపట్టి ప్రజల సమస్యలను ప్రత్యక్షంగా పరిశీలించాలని కోరారు.



వరంగల్‌లో రోడ్డు ప్రమాదం..
లెక్చరర్ సూరిశెట్టి అనిల్ దుర్మరణం

వరంగల్, నవంబర్ 27 (ప్రజానేస్తం జ్వాల):



ఖిలా తూర్పుకోట ప్రాంతానికి చెందిన లెక్చరర్ సూరిశెట్టి అనిల్ రోడ్డు ప్రమాదంలో మృతి చెందారు. నిన్న అర్ధరాత్రి ఈ ప్రమాదం జరిగినట్లు ప్రాథమిక సమాచారం.విధులు ముగించుకుని ద్విచక్ర వాహనంపై ఇంటికి తిరిగి వస్తుండగా వాహనం అదుపుతప్పి ప్రమాదానికి గురైనట్లు తెలుస్తోంది. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనాస్థలానికి చేరుకుని కేసు నమోదు చేశారు. తీవ్రంగా గాయపడిన అనిల్‌ను చికిత్స నిమిత్తం ఎంజీఎం ఆసుపత్రికి తరలించగా, అప్పటికే మృతి చెందినట్లు సమాచారం.ప్రమాదానికి గల పూర్తి కారణాలు తెలియాల్సి ఉంది. లెక్చరర్ అనిల్ మృతితో తూర్పుకోట ప్రాంతంలో విషాదఛాయలు అలుముకున్నాయి.

ఎస్ఐ పరీక్ష నేపథ్యంలో వాకర్స్‌కు పోలీస్ కమిషనర్ విజ్ఞప్తి

- **ట్రై సిటీ పరిధిలోని ఆరు పరీక్షా కేంద్రాల మైదానాల్లో వాకింగ్‌కు తాత్కాలిక నిషేధం**



వరంగల్, నవంబర్ 27 (ప్రజానేస్తం జ్వాల):

తెలంగాణ రాష్ట్ర స్థాయి పోలీస్ నియామక మండలి (TSLPRB) ఆధ్వర్యంలో ఈ నెల 29న (ఆదివారం) సబ్ ఇన్‌స్పెక్టర్ (ఎస్ఐ) ఉద్యోగాల భర్తీకి ప్రిలిమినరీ రాత పరీక్ష నిర్వహించనున్నారు. వరంగల్ పోలీస్ కమిషనరేట్ ట్రై సిటీ పరిధిలోని 32 పరీక్షా కేంద్రాల్లో ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు పరీక్ష జరగనుంది.ఈ నేపథ్యంలో పరీక్షల నిర్వహణ, భద్రతా ఏర్పాట్ల దృష్ట్యా పరీక్షా కేంద్రాలుగా ఎంపికైన పాఠశాలలు, కళాశాలల మైదానాల్లో వాకర్స్‌కు తాత్కాలికంగా అనుమతి నిలిపివేశారు. ఈ నెల 28వ తేదీ (శనివారం) సాయంత్రం 6 గంటల నుంచి, 29వ తేదీ (ఆదివారం) ఉదయం కింది పరీక్షా కేంద్రాల మైదానాల్లో వాకింగ్‌కు రావద్దని పోలీసులు సూచించారు.

1. సెయింట్ గాబ్రియేల్ హైస్కూల్, కాజీపేట.
2. ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల, హనుమకొండ.
3. కాకతీయ డిగ్రీ కళాశాల, హనుమకొండ.
4. కాకతీయ యూనివర్సిటీ క్యాంపస్.
5. లాల్ బహదూర్ కళాశాల, వరంగల్.
6. ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల, వరంగల్.

పరీక్షలు ప్రశాంతంగా, సజావుగా నిర్వహించేందుకు పోలీస్ శాఖ చేపడుతున్న భద్రతా చర్యలకు వాకర్స్‌తో పాటు ప్రజలందరూ సహకరించాలని వరంగల్ పోలీస్ కమిషనర్ ఎన్. శ్వేత, ఐపీఎస్ విజ్ఞప్తి చేశారు.

వరంగల్ విశ్వకర్మ వీధిలో యువకుడి అనుమానాస్పద మృతి

వరంగల్, నవంబర్ 27 (ప్రజానేస్తం జ్వాల):



వరంగల్ నగరంలోని విశ్వకర్మ వీధిలో ఓ యువకుడు అనుమానాస్పద స్థితిలో మృతిచెందిన ఘటన కలకలం రేపింది. అర్ధరాత్రి సమయంలో రక్తపు మడుగులో పడి ఉన్న యువకుడిని అతని స్నేహితుడు గమనించి వెంటనే ఎంజీఎం ఆసుపత్రికి తరలించినట్లు సమాచారం.మృతుడిని పుప్పాలగుట్టకు చెందిన విక్రమ్‌గా పోలీసులు గుర్తించారు. అతను ఆటో డ్రైవర్‌గా పనిచేస్తున్నట్లు తెలిసింది. అయితే యువకుడి మృతికి గల కారణాలు ఇంకా తెలియరాలేదు.సమాచారం అందుకున్న మట్టేవాడ పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. అనుమానాస్పద మృతిగా కేసును పరిగణించి వివిధ కోణాల్లో విచారణ చేపడుతున్నారు. పోలీసుల దర్యాప్తు అనంతరం మరిన్ని వివరాలు వెల్లడయ్యే అవకాశం ఉంది.

నర్సంపేటలో ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభం

నర్సంపేట, నవంబర్ 27 (ప్రజానేస్తం జ్వాల):



రైతుల సంక్షేమానికి రాష్ట్ర ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తోందని నర్సంపేట మున్సిపల్ చైర్‌పర్సన్ పెండెం శ్రీలక్ష్మీరామానంద్ అన్నారు.శుక్రవారం నర్సంపేట పట్టణంలోని 3వ వార్డు కమలాపురంలో శ్రీ వెంకటేశ్వర రైతు సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. రైతులు దళారులను ఆశ్రయించకుండా ప్రభుత్వం ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో తమ పంటను మద్దతు ధరకు విక్రయించుకోవాలని సూచించారు. రైతులు కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకుని పండించిన ధాన్యానికి గిట్టుబాటు ధర పొందాలని అన్నారు.

ప్రజానేస్తం జ్వాల
నిజం కోసం... నిర్భయంగా...
www.prajanesthamjwalanews.com | prajanesthamnews@gmail.com

పొగమంచులో ప్రయాణించేటప్పుడు అప్రమత్తంగా ఉండాలి

రోడ్డు ప్రమాదాల నివారణకు వాహనదారులు తగిన జాగ్రత్తలు పాటించాలి

చలి తీవ్రత పెరుగుతోంది.. ప్రజలు అప్రమత్తంగా ఉండాలి: ఎస్పీ కె. నరసింహ

సూర్యాపేట, నవంబర్ 27 (ప్రజానేస్తం జ్వాల):

జిల్లాలో రోజురోజుకూ చలి తీవ్రత పెరుగుతున్న నేపథ్యంలో ప్రజలు, ముఖ్యంగా వాహనదారులు అప్రమత్తంగా ఉండాలని సూర్యాపేట జిల్లా ఎస్పీ కె. నరసింహ, ఐపీఎస్ సూచించారు. తెల్లవారుజామున, రాత్రి సమయాల్లో పొగమంచు కారణంగా రహదారులపై ఎదురుగా వచ్చే వాహనాలు, రోడ్డు మార్గాలు స్పష్టంగా కనిపించక ప్రమాదాలు జరిగే అవకాశం ఉందని హెచ్చరించారు. చలికాలంలో పొగమంచు ప్రభావంతో రోడ్డు ప్రమాదాల ముప్పు పెరిగే అవకాశం ఉన్నందున వాహనదారులు ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని ఎస్పీ కోరారు. ప్రయాణ సమయంలో నిర్లక్ష్యం ప్రాణాపాయానికి దారితీస్తుందని, ప్రతి ఒక్కరూ రహదారి భద్రతా నియమాలను తప్పనిసరిగా పాటించాలని సూచించారు.

వాహనదారులు పాటించాల్సిన జాగ్రత్తలు:

– పొగమంచు తీవ్రంగా ఉన్న సమయంలో అత్యవసరమైతే తప్ప ప్రయాణాలను వాయిదా వేసుకోవాలి.

– వాహనాలను నెమ్మదిగా నడుపుతూ నిర్ణీత వేగ పరిమితులను పాటించాలి.

– అవసరాన్ని బట్టి వాహనాల హెడ్‌లైట్లు, ఫాగ్ లైట్లను వినియోగించాలి.

– ముందు వెళ్తున్న వాహనానికి తగినంత దూరం పాటించాలి.

– ఆకస్మికంగా బ్రేకులు వేయడం, ప్రమాదకరంగా ఓవర్‌టేక్ చేయడం మానుకోవాలి.

– ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలి. కార్లలో ప్రయాణించేవారు సీట్‌బెల్ట్ పెట్టుకోవాలి.

– మద్యం సేవించి వాహనాలు నడపరాదు. డ్రైవింగ్ సమయంలో మొబైల్ ఫోన్ వినియోగించకూడదు.



పిల్లలు, వృద్ధుల పట్ల ప్రత్యేక శ్రద్ధ అవసరం

చలి తీవ్రత కారణంగా చిన్నపిల్లలు, వృద్ధులు అనారోగ్యానికి గురయ్యే అవకాశం ఉన్నందున కుటుంబ సభ్యులు వారి పట్ల ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని ఎస్పీ సూచించారు. చలి నుంచి రక్షణ పొందేందుకు తగిన ఉన్ని దుస్తులు, స్వెటర్లు, టోపీలు ధరించేలా చూడాలని తెలిపారు.ప్రజల భద్రతే పోలీస్ శాఖ ప్రధాన లక్ష్యమని పేర్కొంటూ, ప్రతి ఒక్కరూ పోలీస్ శాఖ సూచనలు, రహదారి భద్రతా నిబంధనలు పాటించి ప్రమాదాల నివారణకు సహకరించాలని ఎస్పీ కె. నరసింహ విజ్ఞప్తి చేశారు.

వడ్డీ, చిట్టీ వ్యాపారుల ఇళ్లలో పోలీసుల మెరుపు దాడులు

కాగజ్‌నగర్, నవంబర్ 27 (ప్రజానేస్తం జ్వాల):



కొమురం భీమ్ ఆసిఫాబాద్ జిల్లా కాగజ్‌నగర్ పట్టణంలో వడ్డీ, చిట్టీ వ్యాపారుల ఇళ్లలో పోలీసులు ఏకకాలంలో మెరుపు సోదాలు నిర్వహించడం పట్టణంలో కలకలం రేపింది. వడ్డీ, చిట్టీ వ్యాపారాలకు సంబంధించిన లావాదేవీలపై సమాచారం మేరకు పోలీసులు ఈ తనిఖీలు చేపట్టినట్లు తెలుస్తోంది.ఈ సందర్భంగా పలువురు వ్యాపారుల ఇళ్లలో వడ్డీ లావాదేవీలకు సంబంధించిన పత్రాలు, చిట్టీ రికార్డులు, ఇతర ముఖ్యమైన దస్త్రాలను పోలీసులు క్షుణ్ణంగా పరిశీలించారు. తనిఖీల సమయంలో కొన్ని ఇళ్లలో గుర్తించిన పత్రాలను పోలీసులు స్వాధీనం చేసుకున్నట్లు సమాచారం.ఉదయం నుంచి ఏకకాలంలో కొనసాగిన ఈ సోదాలతో కాగజ్‌నగర్ పట్టణంలోని వడ్డీ, చిట్టీ వ్యాపారుల్లో ఆందోళన నెలకొంది. పోలీసుల ఆకస్మిక తనిఖీలతో ఆయా వ్యాపార వర్గాల్లో చర్చ మొదలైంది. అయితే ఈ సోదాల్లో ఎంతమంది వ్యాపారుల ఇళ్లను తనిఖీ చేశారు? ఎంతమేర పత్రాలను స్వాధీనం చేసుకున్నారు? తనిఖీలకు సంబంధించిన పూర్తి వివరాలు ఏమిటి? అనే అంశాలపై స్పష్టత రావాల్సి ఉంది. పోలీసుల విచారణ అనంతరం సోదాలకు సంబంధించిన మరిన్ని వివరాలు వెల్లడయ్యే అవకాశం ఉంది.

మాదక ద్రవ్యాల రహిత సమాజ నిర్మాణమే లక్ష్యం

నశా ముక్త్ భారత్ అభియాన్ ప్రచార పోస్టర్ ఆవిష్కరించిన కలెక్టర్ కె. హరిత

ఆసిఫాబాద్, నవంబర్ 27 (ప్రజానేస్తం జ్వాల):



మాదక ద్రవ్యాల రహిత సమాజ నిర్మాణమే లక్ష్యంగా ప్రతి ఒక్కరూ కృషి చేయాలని కొమురం భీమ్ ఆసిఫాబాద్ జిల్లా కలెక్టర్ కె. హరిత పిలుపునిచ్చారు. నశా ముక్త్ భారత్ అభియాన్‌లో భాగంగా రూపొందించిన ప్రచార పోస్టర్‌ను కలెక్టర్ కార్యాలయంలో ఆమె ఆవిష్కరించారు.ఆసిఫాబాద్ కలెక్టర్ కార్యాలయంలో ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ (ఐఆర్‌సీఎస్) జిల్లా చైర్మన్ డాక్టర్ కొత్తపల్లి అనిత ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ మాదక ద్రవ్యాల వినియోగం వల్ల వ్యక్తుల ఆరోగ్యంతో పాటు కుటుంబాలు, సమాజంపై కూడా తీవ్ర ప్రభావం పడుతుందని పేర్కొన్నారు. ముఖ్యంగా యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని, వాటి దుష్ప్రభావాలపై ప్రజల్లో విస్తృత అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందని తెలిపారు.నశా ముక్త్ భారత్ అభియాన్ లక్ష్యాలను ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు స్వచ్ఛంద సంస్థలు, యువజన సంఘాలు, విద్యాసంస్థలు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. మాదక ద్రవ్యాల రహిత సమాజ నిర్మాణంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర రెడ్ క్రాస్ సొసైటీ మేనేజింగ్ కమిటీ సభ్యుడు డాక్టర్ కొత్తపల్లి శ్రీనివాస్, జిల్లా రెడ్ క్రాస్ సొసైటీ వైస్ చైర్మన్ పోతురాజుల లక్ష్మణ్, కోశాధికారి రతన్ గైన్, జిల్లా కమిటీ సభ్యులు హితేష్ అగర్వాల్, డాక్టర్ తిరుమలేష్, డాక్టర్ ప్రవీణ్, సుమిత్ర, పూల రఘు తదితరులు పాల్గొన్నారు.

భాగిర్థిపేట ప్రభుత్వ పాఠశాలలో పదో తరగతి విద్యార్థులకు ప్రతిభా పరీక్ష

విద్యార్థులందరికీ ఆల్ ఇన్ వన్ పుస్తకాల బహూకరణ

రేగోండ, నవంబర్ 27 (ప్రజానేస్తం జ్వాల):



భూపాలపల్లి జిల్లా భాగిర్థిపేట ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో పదో తరగతి విద్యార్థుల కోసం హెల్ప్ టు నీడీ గ్రూప్ ఆధ్వర్యంలో ప్రతిభా పరీక్షను విజయవంతంగా నిర్వహించారు. విద్యార్థుల్లో చదువుపై ఆసక్తిని పెంపొందించడంతో పాటు వారిలో దాగి ఉన్న ప్రతిభను వెలికితీయాలనే లక్ష్యంతో ఈ కార్యక్రమాన్ని చేపట్టారు.పాఠశాలలో పదో తరగతి చదువుతున్న ఐదుగురు విద్యార్థులను ప్రోత్సహించే ఉద్దేశంతో వారందరికీ ఆల్ ఇన్ వన్ పుస్తకాలను బహుమతులుగా అందజేశారు. జెన్కో కానిస్టేబుల్, కేటీపీపీకి చెందిన ఎన్. ఆంజనేయులు ఈ పుస్తకాలను అందించగా, హెల్ప్ టు నీడీ గ్రూప్ సభ్యుల చేతుల మీదుగా విద్యార్థులకు పంపిణీ చేశారు.ఈ సందర్భంగా వెముల కుమారస్వామి విద్యార్థులకు విలువైన సలహాలు, సూచనలు అందించారు. చదువుపై మరింత ఆసక్తి పెంపొందించుకోవాలని, కష్టపడి చదివి ఆత్మవిశ్వాసంతో ముందుకు సాగాలని సూచించారు. లక్ష్యాలను నిర్దేశించుకుని వాటి సాధన కోసం పట్టుదలతో కృషి చేయాలని ప్రోత్సహించారు.ఆర్థికంగా వెనుకబడిన విద్యార్థులను ప్రోత్సహించడం, వారిలోని ప్రతిభను గుర్తించి తగిన సహకారం అందించడం, భవిష్యత్తులో ఉన్నత శిఖరాలను అధిరోహించేలా ప్రోత్సహించడం ఈ కార్యక్రమం ప్రధాన ఉద్దేశమని నిర్వాహకులు తెలిపారు.ఈ కార్యక్రమం విజయవంతానికి సహకరించిన భగీర్తిపేట ప్రభుత్వ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయ బృందం, పుస్తకాల దాత ఎన్. ఆంజనేయులు, ప్రశ్నాపత్రాల రూపకల్పనలో సహకరించినవారు, పరీక్ష నిర్వహణలో పాల్గొన్నవారితో పాటు ప్రత్యక్షంగా, పరోక్షంగా సహకరించిన ప్రతి ఒక్కరికీ హెల్ప్ టు నీడీ గ్రూప్ సభ్యులు హృదయపూర్వక ధన్యవాదాలు తెలిపారు.

వీధి కుక్కల నియంత్రణకు చర్యలు చేపట్టాలి

ఆసిఫాబాద్, నవంబర్ 27 (ప్రజానేస్తం జ్వాల):

ఆసిఫాబాద్ జిల్లాలో వీధి కుక్కల సంచారాన్ని నియంత్రించి ప్రజలకు భద్రత కల్పించేందుకు తక్షణ చర్యలు చేపట్టాలని అదనపు కలెక్టర్ యువరాజ్ మర్మాట్ అధికారులను ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్‌లో వీధి కుక్కల నియంత్రణపై నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆయన అధికారులకు పలు సూచనలు చేశారు.జిల్లాలో వీధి కుక్కల సంఖ్యను క్షేత్రస్థాయిలో గుర్తించి, వాటి నియంత్రణకు సమగ్ర కార్యాచరణ రూపొందించాలని సూచించారు. కోసిని శివారులో కుక్కల కోసం ఆశ్రయ కేంద్రాలు ఏర్పాటు చేయాలని అధికారులకు తెలిపారు.ముఖ్యంగా పాఠశాలలు, ఆసుపత్రుల పరిసరాల్లో వీధి కుక్కల సంచారాన్ని అరికట్టేందుకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ప్రజలకు, ముఖ్యంగా చిన్నారులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా తగిన జాగ్రత్తలు పాటించాలని పేర్కొన్నారు.ఏర్పాటు చేసే ఆశ్రయ కేంద్రాల్లో కుక్కలకు కుటుంబ నియంత్రణ శస్త్రచికిత్సలు నిర్వహించేలా చర్యలు చేపట్టాలని అదనపు కలెక్టర్ అధికారులకు సూచించారు. వీధి కుక్కల సమస్య పరిష్కారానికి సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని ఆయన ఆదేశించారు.

ప్రతి కుటుంబం ఇందిరమ్మ జీవిత బీమా పథకానికి దరఖాస్తు చేసుకోవాలి

- **అర్హులైన ప్రతి ఒక్కరికీ బీమా భరోసా అందాలి**

హుజూర్‌నగర్, నవంబర్ 27 (ప్రజానేస్తం జ్వాల):



రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకానికి 25వ వార్డులోని ప్రతి కుటుంబం తప్పనిసరిగా దరఖాస్తు చేసుకోవాలని మున్సిపల్ ఫ్లోర్ లీడర్, 25వ వార్డు కౌన్సిలర్ కోతి సంపత్ రెడ్డి ప్రజలకు విజ్ఞప్తి చేశారు.ఈ మేరకు శుక్రవారం మున్సిపల్ కార్యాలయంలో 25వ వార్డుకు సంబంధించిన ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా నమోదు కేంద్రాన్ని ఆయన సందర్శించారు. అక్కడ జరుగుతున్న నమోదు ప్రక్రియను పరిశీలించి, విధులు నిర్వహిస్తున్న సిబ్బందికి పలు సూచనలు చేశారు. ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా నమోదు ప్రక్రియను వేగవంతంగా, పారదర్శకంగా నిర్వహించాలని సూచించారు.ఈ సందర్భంగా కోతి సంపత్ రెడ్డి మాట్లాడుతూ.. ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకం పేద, మధ్యతరగతి కుటుంబాలకు ఆర్థిక భరోసా కల్పించే కార్యక్రమమని పేర్కొన్నారు. కుటుంబ పెద్దకు అనుకోని ప్రమాదం సంభవించినప్పుడు ఆ కుటుంబం ఆర్థికంగా ఇబ్బందులు ఎదుర్కోకుండా బీమా పథకం అండగా నిలుస్తుందని తెలిపారు. అందువల్ల 25వ వార్డులోని ప్రతి కుటుంబం ఈ పథకంలో నమోదు చేసుకోవాలని, ఒక్క కుటుంబం కూడా అవకాశం కోల్పోకుండా చూడాలని కోరారు.అర్హులైన కుటుంబాలు ఆధార్ కార్డు, రేషన్ కార్డు తదితర అవసరమైన పత్రాలతో నమోదు కేంద్రానికి వచ్చి తమ వివరాలను నమోదు చేసుకోవాలని సూచించారు. పథకం గురించి ప్రజలకు మరింత అవగాహన కల్పించి, అర్హులందరికీ ప్రయోజనం చేకూరేలా కృషి చేయాలని తెలిపారు.అనంతరం నమోదు కేంద్రానికి వచ్చిన ప్రజలతో ఆయన మాట్లాడి, వారి సమస్యలు, సందేహాలను అడిగి తెలుసుకున్నారు. నమోదు ప్రక్రియలో ఏవైనా ఇబ్బందులు లేదా సందేహాలు ఎదురైతే వెంటనే తన దృష్టికి తీసుకురావాలని ప్రజలకు సూచించారు. ఈ కార్యక్రమంలో 3వ వార్డు కౌన్సిలర్ సులువ నాగలక్ష్మి చంద్రశేఖర్, 9వ వార్డు నాయకులు మరసకట్ల కార్తీక్, నమోదు అధికారులు షేక్ బషీర్, నాగమణి, వనరుల ప్రతినిధులు తెల్లబోయిన హేమలత, పాలపాటి శారద తదితరులు పాల్గొన్నారు.

వికలాంగుల ఎన్నికల హామీలను డిసెంబర్ 3లోపు అమలు చేయాలి

కోస్గి--కొడంగల్, నవంబర్ 27 (ప్రజానేస్తం జ్వాల):

వికలాంగులకు ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత అమలు చేయడంలో నిర్లక్ష్యం వహిస్తోందని భారత వికలాంగుల హక్కుల పరిరక్షణ సమితి తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు గిద్దె రాజేష్ ఆరోపించారు. వికలాంగుల సమస్యలను పరిష్కరించడంతో పాటు ఎన్నికల హామీలన్నింటినీ డిసెంబర్ 3లోపు అమలు చేయాలని ఆయన ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.వికలాంగుల సమస్యల పరిష్కారం, ఎన్నికల హామీల అమలు కోరుతూ భారత వికలాంగుల హక్కుల పరిరక్షణ సమితి ఆధ్వర్యంలో కోస్గి నుంచి కొడంగల్ వరకు నాలుగు రోజుల పాటు నిర్వహించిన పాదయాత్ర ముగింపు సభలో గిద్దె రాజేష్ మాట్లాడారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వికలాంగుల పెన్షన్‌ను రూ.6,000కు పెంచడం, ఆర్టీసీలో 100 శాతం ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పించడం, బ్యాక్‌లాగ్ ఉద్యోగాల భర్తీకి ప్రత్యేక నోటిఫికేషన్లు విడుదల చేయడం, ప్రత్యేక వికలాంగుల సంక్షేమ శాఖ ఏర్పాటు చేయడం, రాజకీయ ప్రాతినిధ్యం కల్పించడం వంటి ప్రధాన ఎన్నికల హామీలను ప్రభుత్వం తక్షణమే అమలు చేయాలని డిమాండ్ చేశారు.ఎన్నికల సమయంలో వికలాంగులకు ఇచ్చిన హామీల అమలు కోసం ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకురావడమే లక్ష్యంగా నాలుగు రోజుల పాదయాత్ర నిర్వహించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో వికలాంగులు, సంఘం నాయకులు చూపిన పోరాట స్ఫూర్తిని ఆయన అభినందించారు.పాదయాత్ర విజయవంతానికి కృషి చేసిన జిల్లా అధ్యక్షుడు పోతురాజు సుదీర్, జిల్లా కార్యదర్శి తోకను వెంకటేష్, తాండూరు నాయకుడు నర్సింహులు, జిల్లా నాయకులు మల్కయ్య, ఆంజనేయులు, రాములు, వివిధ మండలాల బాధ్యులు, మహిళా నాయకులు, వీల్‌చైర్లపై పాల్గొన్న వికలాంగులు, సంఘం కార్యకర్తలకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఎండనక, వాననక నాలుగు రోజుల పాటు లక్ష్య సాధన కోసం శ్రమించిన ప్రతి ఒక్కరి కృషిని ప్రశంసించారు.వికలాంగుల హక్కుల కోసం ప్రజాస్వామ్య పద్ధతిలో పోరాడుతున్న నాయకులను పోలీసులు నిర్బంధిస్తున్నారని, అక్రమ అరెస్టులకు పాల్పడుతున్నారని గిద్దె రాజేష్ ఆరోపించారు. పోలీసుల చర్యలతో ఉద్యమాన్ని అణచివేయాలని ప్రయత్నిస్తున్నారని విమర్శించారు. ఎన్ని అడ్డంకులు ఎదురైనా వికలాంగుల హక్కుల సాధన కోసం పోరాటం కొనసాగిస్తామని ఆయన స్పష్టం చేశారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని ఉద్దేశించి మాట్లాడుతూ.. డిసెంబర్ 3లోపు వికలాంగులకు ఇచ్చిన ప్రతి ఎన్నికల హామీని అమలు చేయాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో తెలంగాణలో కాంగ్రెస్ పార్టీ కూడా ఆంధ్రప్రదేశ్‌లో ఎదురైన రాజకీయ పరిస్థితులను ఎదుర్కోవాల్సి వస్తుందని హెచ్చరించారు. వికలాంగుల హామీలు అమలయ్యే వరకు ప్రభుత్వాన్ని ప్రజాక్షేత్రంలో ప్రశ్నిస్తూనే ఉంటామని కోస్గి--కొడంగల్ పాదయాత్ర ముగింపు సభలో గిద్దె రాజేష్ ప్రకటించారు.



గుట్ట కింది తండా వాసుల రోడ్డు కష్టాలు తీరనున్నాయి

- **సీసీ రోడ్డు నిర్మాణ పనులు ప్రారంభించిన సర్పంచ్ డప్ప శ్రీనివాస్**

భీమదేవరపల్లి, నవంబర్ 27 (ప్రజానేస్తం జ్వాల):



ఏళ్ల తరబడి సరైన రహదారి సౌకర్యం లేక ఇబ్బందులు పడుతున్న గుట్ట కింది తండా వాసుల రోడ్డు కష్టాలు త్వరలో తీరనున్నాయి. రాంనగర్ గ్రామపంచాయతీ పరిధిలోని రోడ్డు మీద తండా నుంచి గుట్ట కింది తండా వరకు చేపట్టనున్న సీసీ రోడ్డు నిర్మాణ పనులను సర్పంచ్ డప్ప శ్రీనివాస్, ఉపసర్పంచ్ భూక్య తిరుపతితో కలిసి ప్రారంభించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. గత కొన్నేళ్లుగా సరైన రహదారి లేక తండా ప్రజలు రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. ముఖ్యంగా నిత్యావసర పనులు, ఇతర అవసరాల కోసం ప్రయాణించే సమయంలో రహదారి సమస్యతో ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు. ఈ సమస్యకు పరిష్కారంగా మంత్రి పొన్నం ప్రభాకర్ ప్రత్యేక చొరవతో సుమారు రూ.కోటి నిధులతో సీసీ రోడ్డు నిర్మాణానికి మార్గం సుగమమైందని తెలిపారు.రోడ్డు నిర్మాణానికి సహకరించిన మంత్రి పొన్నం ప్రభాకర్‌కు తండా ప్రజల తరఫున కృతజ్ఞతలు తెలిపారు. పనులు పూర్తయితే గుట్ట కింది తండా ప్రజలకు రాకపోకల సౌకర్యం మెరుగుపడనుంది.ఈ కార్యక్రమంలో మండల ఎస్టీ సెల్ మహిళా అధ్యక్షురాలు బాదావత్ కళావతి, లక్ష్మణ్, వీరన్న, సంపత్, మంజుల తదితరులు పాల్గొన్నారు.

పాకాల చెరువు మధ్యలో కొలువైన గుండం శివాలయం.. కార్తీక మాసంలో ప్రత్యేక పూజలు

పాకాల, నవంబర్ 27 (ప్రజానేస్తం జ్వాల):

పాకాల అటవీ ప్రాంతంలోని ప్రసిద్ధ పాకాల చెరువు మధ్యలో ప్రకృతి అందాల నడుమ కొలువై ఉన్న గుండం శివాలయం భక్తులను విశేషంగా ఆకట్టుకుంటోంది. పన్నెండో శతాబ్దంలో కాకతీయ రాజు గణపతిదేవుడు ఈ శైవక్షేత్రాన్ని నిర్మించినట్లు స్థానికంగా ప్రసిద్ధి.చుట్టూ పచ్చని ప్రకృతి, మధ్యలో ప్రశాంతమైన చెరువు వాతావరణం మధ్య వెలసిన పరమేశ్వరుడి ఆలయం ఆధ్యాత్మికతతో పాటు ప్రకృతి సౌందర్యానికి ప్రతీకగా నిలుస్తోంది. గుండం శివాలయం పాకాల ప్రాంతంలోని ప్రముఖ శైవక్షేత్రంగా భక్తుల ఆదరణ పొందుతోంది.కార్తీక మాసం శుక్రవారం, ఆరుద్ర నక్షత్రాన్ని పురస్కరించుకుని ఆలయంలో స్వామివారికి అభిషేకం, విశేష పూజలు, హారతి కార్యక్రమాలు నిర్వహించారు. ఆరుద్ర నక్షత్రం స్వామివారి జన్మనక్షత్రమని భావించే భక్తులు ప్రత్యేక పూజల్లో పాల్గొని పరమేశ్వరుడిని దర్శించుకున్నారు. స్వామివారి దివ్య మంగళ స్వరూపాన్ని దర్శించుకుని భక్తులు ఆధ్యాత్మిక ఆనందాన్ని పొందాలని ఆలయ విశేషాలు తెలియజేస్తున్నాయి.



ప్రజానేస్తం జ్వాల
నిజం కోసం... నిర్భయంగా...
www.prajanesthamjwalanews.com | prajanesthamnews@gmail.com

రైతుల ఆర్థిక అభివృద్ధికి సహకార సంఘాలే బలమైన వేదికలు

- పెద్దాపురం పీఏసీఎస్‌ను రైతులకు మరింత సేవలందించే ఆదర్శ సంస్థగా తీర్చిదిద్దాలి: ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్ రెడ్డి

దామెర, నవంబర్ 27 (ప్రజానేస్తం జ్వాల):

రైతుల ఆర్థిక అభివృద్ధికి సహకార సంఘాలు బలమైన వేదికలని, వాటిని మరింత బలోపేతం చేయడమే కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వ లక్ష్యమని పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్ రెడ్డి అన్నారు. రైతులకు మెరుగైన సేవలు అందిస్తూ, వారి సమస్యలకు పరిష్కారం చూపేలా పెద్దాపురం ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాన్ని అభివృద్ధి చేయాలని సూచించారు.దామెర మండలం ఊరుగొండ సొసైటీ కార్యాలయంలో పెద్దాపురం పీఏసీఎస్ చైర్మన్ కమలాపురం రమేష్, నూతన పాలకమండలి సభ్యుల పదవీ బాధ్యతల స్వీకార కార్యక్రమానికి ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. అంతకుముందు ఊరుగొండ స్టేజీ నుంచి సొసైటీ కార్యాలయం వరకు డప్పు చప్పుళ్లతో భారీ ర్యాలీ నిర్వహించారు. అనంతరం నూతన చైర్మన్, పాలకమండలి సభ్యులకు ఎమ్మెల్యే శుభాకాంక్షలు తెలిపారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. రైతుల సంక్షేమమే లక్ష్యంగా కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం పనిచేస్తోందని పేర్కొన్నారు. కష్టపడిన ప్రతి కాంగ్రెస్ కార్యకర్తకు గుర్తింపు లభిస్తుందని, అందరూ ఒక కుటుంబంలా కలిసి పనిచేసి పీఏసీఎస్ అభివృద్ధికి కృషి చేయాలని అన్నారు. రైతులు సంఘటితంగా అభివృద్ధి చెందేందుకు సహకార వ్యవస్థను ఏర్పాటు చేశారని, ఆ లక్ష్యాన్ని నూతన పాలకమండలి ముందుకు తీసుకెళ్లాలని సూచించారు.రైతులకు మెరుగైన సేవలు అందించడం, వారి సమస్యలను గుర్తించి పరిష్కరించడం నూతన కార్యవర్గం ప్రధాన బాధ్యతగా భావించాలని అన్నారు. రైతులకు అవసరమైన ఎరువులు, విత్తనాలు, ఇతర వ్యవసాయ సేవలను సకాలంలో అందించడంలో పీఏసీఎస్ కీలక పాత్ర పోషించాలని తెలిపారు.వ్యవసాయ రంగంలో వస్తున్న మార్పులకు అనుగుణంగా రైతులు ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించుకోవాలని సూచించారు. క్లస్టర్ల వారీగా రైతు ఉత్పత్తిదారుల సంఘాలను ఏర్పాటు చేయనున్నట్లు వెల్లడించారు.



కన్సల్టెన్సీ ద్వారా రైతులకు వ్యవసాయంపై అవగాహన కల్పించడంతో పాటు శిక్షణ కార్యక్రమాలు నిర్వహిస్తామని తెలిపారు.పెద్దాపురంలో గోదాం నిర్మాణం చేపడతామని, పీఏసీఎస్ కార్యాలయం చుట్టూ ప్రహరీ గోడ నిర్మాణం కూడా ఏర్పాటు చేస్తున్నామని ఎమ్మెల్యే పేర్కొన్నారు. సహకార వ్యవస్థ ద్వారా రైతులకు మరింత ప్రయోజనం చేకూర్చేలా సమష్టిగా పనిచేయాలని, మారుతున్న వ్యవసాయ పద్ధతులకు అనుగుణంగా ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో డీసీఓ మోహన్, ఊరుగొండ సర్పంచ్ పోలేపాక శ్రీనివాస్, పరకాల వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ చందుపట్ల రాజిరెడ్డి, పెంచికలపేట పీఏసీఎస్ చైర్మన్ అగితే లింగన్న, ఆత్మకూరు పీఏసీఎస్ చైర్మన్ నాగెల్లి స్వప్న ఆంధ్రయ్య, తహశీల్దార్ జ్యోతి, ఏవో రాకేష్, ఎస్సై వీరభద్రం, పీఏసీఎస్ సీఈఓ శ్రీనివాస్, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు దుబాసి రాజేందర్, రేవూరి జలంధర్ రెడ్డి, మాజీ పీఏసీఎస్ చైర్మన్ గుడిపాటి శ్రీధర్ రెడ్డి, సర్పంచులు, నాయకులు, సొసైటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

రైతుల సంక్షేమమే కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వ లక్ష్యం

- సహకార సంఘాలు రైతులకు బలమైన అండగా నిలవాలి: ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్ రెడ్డి

సంగెం, నవంబర్ 27 (ప్రజానేస్తం జ్వాల):

రైతుల సంక్షేమమే లక్ష్యంగా కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం పనిచేస్తోందని పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్ రెడ్డి అన్నారు. సహకార సంఘాలు రైతులకు బలమైన అండగా నిలుస్తూ వ్యవసాయ రంగ అభివృద్ధిలో కీలక పాత్ర పోషించాలని పిలుపునిచ్చారు.సంగెం మండలం కాపుల కనపర్తి ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం (పీఏసీఎస్) కార్యాలయంలో నూతన పాలకమండలి పదవీ బాధ్యతల స్వీకార మహోత్సవానికి ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. అంతకుముందు నిర్వహించిన భారీ ర్యాలీలో పాల్గొన్నారు. అనంతరం నూతన చైర్మన్ చొల్లేటి మాధవరెడ్డితో పాటు పాలకమండలి సభ్యులకు శుభాకాంక్షలు తెలియజేశారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. కాపుల కనపర్తి పీఏసీఎస్‌ను ఆదర్శవంతమైన నమూనా సహకార సంఘంగా తీర్చిదిద్దాలనే నమ్మకం నూతన చైర్మన్ మాధవరెడ్డి, డైరెక్టర్లపై తనకు ఉందన్నారు. కష్టపడిన ప్రతి కార్యకర్తకు తగిన గుర్తింపు లభిస్తుందని పేర్కొన్నారు. సహకార వ్యవస్థ ద్వారా రైతులకు మరింత ప్రయోజనం చేకూర్చడంతో పాటు వారి ఆర్థిక స్థితిగతులను మెరుగుపరిచేందుకు పాలకమండలి కృషి చేయాలని సూచించారు.మారుతున్న వ్యవసాయ పద్ధతులు, రైతుల అవసరాలకు అనుగుణంగా సహకార సంఘాలు ఆధునిక విధానాలను అనుసరించాల్సిన అవసరం ఉందన్నారు. పీఏసీఎస్ అనేది కేవలం వ్యాపార కార్యకలాపాలకే పరిమితమైన సంస్థ కాదని, రైతుల ఆర్థిక అభివృద్ధి, సంక్షేమం, వారికి అవసరమైన సేవలు అందించడమే ప్రధాన లక్ష్యంగా పనిచేసే సహకార వ్యవస్థ అని వివరించారు.కాపుల కనపర్తి పీఏసీఎస్ డీసీసీబీలో విలీనమైందని పేర్కొన్న ఎమ్మెల్యే, రైతులకు ఎరువులు, వ్యవసాయ అవసరాలు, ఆర్థిక సహకారం వంటి సేవలను సమర్థవంతంగా అందించాలని ఆకాంక్షించారు. రైతుల



అవసరాలను గుర్తించి వారికి సకాలంలో సేవలు అందించడం ద్వారా సహకార సంఘాలపై నమ్మకాన్ని మరింత పెంపొందించాలని అన్నారు.నూతనంగా బాధ్యతలు చేపట్టిన చైర్మన్, డైరెక్టర్లు రైతుల విశ్వాసాన్ని నిలబెట్టుకుంటూ సంఘాన్ని ఆదర్శవంతమైన నమూనా సహకార సంస్థగా అభివృద్ధి చేసేందుకు సమిష్టిగా కృషి చేయాలని ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్ రెడ్డి పిలుపునిచ్చారు.

ఆరో రోజుకు చేరిన రాంకీ డంపింగ్ యార్డు వ్యతిరేక రిలే దీక్షలు

- డంపింగ్ యార్డును వెంటనే తొలగించాలి.. పాలకులు స్పందించకుంటే ఎన్నికల్లో తగిన మూల్యం తప్పదు: ప్రజా సంఘాల నేతల హెచ్చరిక

జవహర్‌నగర్, నవంబర్ 27 (ప్రజానేస్తం జ్వాల):

రాంకీ చెత్త డంపింగ్ యార్డు తొలగింపు డిమాండ్‌తో చేపట్టిన ప్రజా ఉద్యమం రోజురోజుకూ ఉధృతమవుతోంది. డంపింగ్ యార్డు కారణంగా పరిసర ప్రాంతాల ప్రజల ఆరోగ్యం, పర్యావరణానికి ముప్పు ఏర్పడుతోందని ఆందోళన వ్యక్తం చేస్తున్న జవహర్‌నగర్ డంపింగ్ యార్డు ఎత్తివేత పోరాట కమిటీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న రిలే నిరాహార దీక్షలు శుక్రవారంతో ఆరో రోజుకు చేరుకున్నాయి. దీక్షా శిబిరాన్ని సందర్శించిన వివిధ రాజకీయ పార్టీలు, ప్రజా సంఘాల నాయకులు డంపింగ్ యార్డును వెంటనే తొలగించాలని డిమాండ్ చేస్తూ పాలకవర్గాలను హెచ్చరించారు.గత ఆరు నెలలుగా ఈ ప్రాంతంలోని విప్లవ, వామపక్ష, అఖిలపక్ష, దళిత, మహిళా సంఘాలు ఏకమై జవహర్‌నగర్ డంపింగ్ యార్డు ఎత్తివేత పోరాట కమిటీగా ఏర్పడి ఉద్యమాన్ని కొనసాగిస్తున్నాయి. లక్షలాది మంది ప్రజల జీవనంపై ప్రభావం చూపుతోందని కమిటీ నాయకులు పేర్కొంటూ, రాజ్యాంగం కల్పించిన జీవించే హక్కును, పర్యావరణ పరిరక్షణను కాపాడేందుకు డంపింగ్ యార్డును తక్షణమే తొలగించాలని డిమాండ్ చేస్తున్నారు.ఈ సమస్య పరిష్కారం కోసం పోరాట కమిటీ నాయకులు రాష్ట్ర ముఖ్యమంత్రి ప్రజాభవన్, జిల్లా కలెక్టర్ కార్యాలయం, హెచ్ఎండీఏ కార్యాలయాల్లో వినతిపత్రాలు సమర్పించారు. స్థానిక ఎంపీ ఈటల రాజేందర్, ఎమ్మెల్యే మల్లారెడ్డి, కాంగ్రెస్ డీసీసీ అధ్యక్షుడు వజ్రేష్ యాదవ్‌తో పాటు చుట్టుపక్కల ప్రాంతాల ఎమ్మెల్యేలకు కూడా తమ డిమాండ్లను తెలియజేశారు. అంతేకాకుండా డంపింగ్ యార్డు పరిసర బస్తీల్లో పాదయాత్రలు నిర్వహించి, ధర్నాలు, నిరసన కార్యక్రమాల ద్వారా ప్రజల్లో అవగాహన కల్పించారు.అయితే తమ విజ్ఞప్తులకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నుంచి ఆశించిన స్పందన రాలేదని పోరాట కమిటీ నాయకులు అసంతృప్తి వ్యక్తం చేశారు. దీంతో నిరసనను మరింత ఉధృతం చేస్తూ చెన్నాపూర్ చౌరస్తాలో రిలే నిరాహార దీక్షలు ప్రారంభించినట్లు తెలిపారు.ఆరో రోజు దీక్షకు సంఘీభావం తెలిపిన వివిధ పార్టీల, ప్రజా సంఘాల నాయకులు మాట్లాడుతూ.. డంపింగ్ యార్డు సమస్యను పాలకులు ఇకనైనా తీవ్రంగా పరిగణించాలని కోరారు. ప్రజల సహనాన్ని పరీక్షించవద్దని, పరిస్థితి మరింత తీవ్రం కాకముందే డంపింగ్ యార్డును తొలగించేందుకు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. తమ డిమాండ్లను పట్టించుకోకపోతే రాబోయే కార్పొరేషన్ ఎన్నికల్లో పాలక పార్టీలకు ప్రజల నుంచి రాజకీయంగా ప్రతికూల ఫలితాలు



ఎదురవుతాయని వారు హెచ్చరించారు.సీపీఎం వెంకన్న, సీపీఐ (ఎంఎల్) న్యూ డెమోక్రసీ ప్రతినిధులు, సీపీఐ (ఎంఎల్) మాస్‌లైన్ ఉయ్యాల ఉమ, బీఎస్పీ బిర్రు యాకస్వామి, ఏఐఎఫ్‌టీయూ వై. మల్లేష్, బి. వెంకటేశ్వర్లు, బహుజన సత్తా బండకింది సింగరయ్య గౌడ్, టీయూ జేపీసీ బి. రాజు, రాణి, డి. లలిత, కె. నర్సన్న, కనకం ఆంజనేయులు, సుజ్జి తదితరులు పాల్గొన్నారు.సీపీఐ (ఎంఎల్) మాస్‌లైన్ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు గద్దం సదానందం, పీఓడబ్ల్యూ డి. స్వరూప, ఐఎఫ్‌టీయూ పి. శివబాబు, పీఓడబ్ల్యూ వి. జయసుధ, ఏఐఎఫ్‌టీయూ వై. మల్లేష్, జర్నలిస్ట్ కొన్నే వేణు, సీపీఐ దర్శనం యాదగిరి, న్యూ డెమోక్రసీ సురేందర్, తెలంగాణ ఉద్యమకారుల జేఏసీ కల్లెపు చంద్రన్న ప్రసాద్, టీవీవీయూ ఏ. కవిత తదితరులు దీక్షా శిబిరాన్ని సందర్శించి సంఘీభావం ప్రకటించారు.

స్నాప్‌చాట్‌లో మహిళకు వేధింపులు.. హనుమకొండ యువకుడి అరెస్ట్

హనుమకొండ, నవంబర్ 27 (ప్రజానేస్తం జ్వాల):

సామాజిక మాధ్యమ వేదిక స్నాప్‌చాట్ ద్వారా ఓ మహిళను వేధించిన ఆరోపణలపై హనుమకొండ జిల్లాకు చెందిన ఎడునూరి అక్షిత్ అనే యువకుడిని హైదరాబాద్ సైబర్ క్రైమ్ పోలీసులు అరెస్ట్ చేశారు.పోలీసులకు అందిన ఫిర్యాదు ప్రకారం.. నిందితుడు బాధిత మహిళకు సంబంధించిన వ్యక్తిగత ఫొటోలను అసభ్యకరంగా మార్పులు చేసి, వాటిని ఆమె స్నేహితులు, పరిచయస్తులకు పంపుతూ వేధింపులకు పాల్పడినట్లు ఆరోపణలు ఉన్నాయి. ఈ చర్యలతో బాధితురాలు తీవ్ర మానసిక ఇబ్బందులకు గురైనట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు.వేధింపులు భరించలేక బాధిత మహిళ సైబర్ క్రైమ్ పోలీసులను ఆశ్రయించి ఫిర్యాదు చేసింది. ఫిర్యాదు ఆధారంగా కేసు నమోదు చేసిన పోలీసులు సాంకేతిక ఆధారాలను సేకరించి నిందితుడిని గుర్తించారు. అనంతరం ఎడునూరి అక్షిత్‌ను అదుపులోకి తీసుకుని అరెస్ట్ చేసినట్లు సమాచారం.



సదాశివపేట మున్సిపాలిటీలో ఏసీబీ దాడులు.. ఇద్దరు ఉద్యోగులు అరెస్ట్

- రూ.15 వేల లంచం తీసుకుంటూ పట్టుబడిన అసిస్టెంట్ ఇంజినీర్, వర్క్ ఇన్‌స్పెక్టర్

సంగారెడ్డి, నవంబర్ 27 (ప్రజానేస్తం జ్వాల):



సదాశివపేట మున్సిపాలిటీలో అవినీతి నిరోధక శాఖ (ఏసీబీ) అధికారులు శుక్రవారం దాడులు నిర్వహించి ఇద్దరు ఉద్యోగులను పట్టుకున్నారు. ఏసీబీ విడుదల చేసిన పత్రికా ప్రకటన ప్రకారం.. మున్సిపల్ అసిస్టెంట్ ఇంజినీర్ ఏ. రాజేష్ కుమార్, ఔట్‌సోర్సింగ్ వర్క్ ఇన్‌స్పెక్టర్ ఏ. శివారెడ్డి రూ.15 వేల లంచం వ్యవహారంలో పట్టుబడ్డారు.ఏసీబీ తెలిపిన వివరాల ప్రకారం.. 2025 గణేశ్ నిమజ్జనం సందర్భంగా ఉబా చెరువులో పూడికతీత పనులు చేపట్టగా, ఆ పనులకు సంబంధించిన రూ.4.50 లక్షల కాంట్రాక్టు బిల్లును మంజూరు చేసి, చెల్లింపు ప్రక్రియ పూర్తి చేసినందుకు ప్రతిఫలంగా ఫిర్యాదుదారుడి నుంచి అసిస్టెంట్ ఇంజినీర్ రాజేష్ కుమార్ రూ.15 వేల లంచం డిమాండ్ చేశారు. శుక్రవారం మధ్యాహ్నం సుమారు 2.30 గంటల సమయంలో మున్సిపల్ కార్యాలయంలో ఆ మొత్తాన్ని స్వీకరించినట్లు ఏసీబీ పేర్కొంది.లంచంగా తీసుకున్న నగదును భద్రపరచాలని రాజేష్ కుమార్ వర్క్ ఇన్‌స్పెక్టర్ శివారెడ్డికి ఇచ్చినట్లు ఏసీబీ అధికారులు తెలిపారు. అనంతరం శివారెడ్డి వద్ద నుంచి ఆ నగదును స్వాధీనం చేసుకున్నట్లు వెల్లడించారు.రాజేష్ కుమార్, శివారెడ్డి తమ అధికారిక హోదాను దుర్వినియోగం చేసి అనుచిత ప్రయోజనం పొందేందుకు ప్రయత్నించినట్లు ఏసీబీ ఆరోపించింది. ఈ కేసులో ఇద్దరినీ అరెస్టు చేసి హైదరాబాద్‌లోని ఏసీబీ ప్రత్యేక న్యాయస్థానంలో హాజరుపరచనున్నట్లు అధికారులు తెలిపారు. ఈ వ్యవహారంపై తదుపరి దర్యాప్తు కొనసాగుతోందని ఏసీబీ తన ప్రకటనలో పేర్కొంది.

రాజంపేట గ్రామపంచాయతీలో డిప్యూటీ కమిషనర్ సుధాకర్ పర్యటన

- అభివృద్ధి పనులు, పారిశుధ్య నిర్వహణపై క్షేత్రస్థాయి పరిశీలన.. ప్రతి ఇంటికీ ఇంకుడు గుంత నిర్మించాలని సూచన

రాజంపేట, నవంబర్ 27 (ప్రజానేస్తం జ్వాల):



పంచాయతీరాజ్ కమిషనర్, ముఖ్య కార్యనిర్వహణ అధికారి దివ్య దేవరాజన్ ఆదేశాల మేరకు డిప్యూటీ కమిషనర్ సుధాకర్ శుక్రవారం రాజంపేట గ్రామపంచాయతీలో పర్యటించి వివిధ అభివృద్ధి పనులను క్షేత్రస్థాయిలో పరిశీలించారు.ఈ సందర్భంగా రాజంపేటలోని జూబ్లీ మార్కెట్‌ను సందర్శించి చికెన్, మటన్, చేపల మార్కెట్ల నిర్వహణను తనిఖీ చేశారు. మార్కెట్ పరిసరాల్లో పారిశుధ్య పరిస్థితులను పరిశీలించారు. అనంతరం గ్రామంలో ఏర్పాటు చేసిన ఇంకుడు గుంతలను పరిశీలించారు.గ్రామంలోని ప్రధాన రహదారి మధ్య విభాజకాలను, గ్రామపంచాయతీ పరిధిలోని వివిధ ప్రాంతాలను గాలినడకన సందర్శించి పారిశుధ్య నిర్వహణను తనిఖీ చేశారు. గ్రామంలో చేపట్టిన వీబీజీ రామ్‌జీ పథకం పనుల పురోగతిని కూడా పరిశీలించారు.ప్రతి ఇంటికీ ఇంకుడు గుంత నిర్మించుకునేలా ప్రజలకు అవగాహన కల్పించాలని అధికారులకు సూచించారు. వర్షపు నీటిని భూమిలోకి ఇంకేలా చేయడం ద్వారా భూగర్భ జలాల పెంపునకు చర్యలు తీసుకోవాలని తెలిపారు. గ్రామంలో అభివృద్ధి పనులు, పారిశుధ్య నిర్వహణపై అధికారులు నిరంతరం పర్యవేక్షణ కొనసాగించాలని సూచించారు.ఈ పర్యటనలో రాజంపేట సర్పంచ్ బుర్సా పోచయ్య, జిల్లా పంచాయతీ కార్యాలయ సమన్వయ అధికారి లక్ష్మీనారాయణ, జిల్లా పంచాయతీ అధికారి బిక్షపతి గౌడ్, డివిజనల్ పంచాయతీ అధికారి ఉమర్ హుస్సేన్, మండల పరిషత్ అభివృద్ధి అధికారి శ్రీనివాస్, మండల పంచాయతీ అధికారి మౌనిక, వార్డు సభ్యుల జిల్లా అధ్యక్షుడు గులాం జావిద్, కొమరం వేణు, జబరి కిషోర్, పంచాయతీ కార్యదర్శి సాయి కృష్ణ, జూనియర్ అసిస్టెంట్ సంతోష్, బిల్ కలెక్టర్ నాగేందర్, గ్రామపంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

కాకతీయ యూనివర్సిటీ హాస్టళ్లలో భోజనం, వసతి సమస్యలపై విద్యార్థుల ఆందోళన

- అన్నంలో పురుగులు వస్తున్నాయని ఫిర్యాదు.. బాలికల వసతి గృహాల్లోనూ తీవ్ర ఇబ్బందులు

హనుమకొండ, నవంబర్ 27 (ప్రజానేస్తం జ్వాల):

కాకతీయ విశ్వవిద్యాలయం హాస్టళ్లలో నెలకొన్న భోజనం, వసతి, పారిశుధ్య సమస్యలపై విద్యార్థి సంఘాల నాయకులు తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లారు.శుక్రవారం హనుమకొండలోని కాకతీయ విశ్వవిద్యాలయంలో అడిషనల్ కలెక్టర్ ఎన్. రవి, సెంట్రల్ జోన్ డీసీపీ ధార కవిత, ఏసీపీ నరసింహారావు, విశ్వవిద్యాలయ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ వి. రామచంద్రం విద్యార్థి సంఘాల నాయకులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు.ఈ సమావేశంలో బాయ్స్ హాస్టల్‌లో అందించే భోజనంలో తరచూ పురుగులు కనిపిస్తున్నాయని, హాస్టల్ ప్రాంగణంలో కనీస పారిశుధ్య నిర్వహణ కూడా సక్రమంగా లేదని విద్యార్థులు అధికారులకు ఫిర్యాదు చేశారు. నాణ్యమైన భోజనం అందించడంతో పాటు పరిశుభ్రమైన వాతావరణం కల్పించాలని కోరారు.గర్ల్స్ హాస్టల్‌లో తీవ్ర వసతి కొరత ఉందని విద్యార్థినులు అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. వర్షాకాలంలో ప్రమాదం జరిగే అవకాశం ఉన్న శిథిల భవనాల్లో నివసించాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. తగిన వసతి కల్పించడంతో పాటు శిథిల భవనాల సమస్యను పరిష్కరించాలని కోరారు.విద్యార్థులు తెలిపిన సమస్యలను ఉన్నతాధికారులు సావధానంగా విన్నారు. సమస్యల పరిష్కారానికి తక్షణ చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. అలాగే చేపట్టిన చర్యల పురోగతిని సమీక్షిస్తామని తెలిపారు.



ప్రజానేస్తం జ్వాల
నిజం కోసం... నిర్భయంగా...
www.prajanesthamjwalanews.com | prajanesthamnews@gmail.com

ప్రేమ పేరుతో వేధింపులు.. తొమ్మిదో తరగతి బాలిక ఆత్మహత్యాయత్నం

- **ముగ్గురు యువకుల వేధింపులే కారణమని తండ్రి ఫిర్యాదు.. ఎంజీఎం ఆసుపత్రిలో చికిత్స**

హనుమకొండ, నవంబర్ 27 (ప్రజానేస్తం జ్వాల):



ప్రేమ పేరుతో ముగ్గురు యువకులు వేధించడంతో తీవ్ర మనస్తాపానికి గురైన తొమ్మిదో తరగతి బాలిక ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన ఘటన వరంగల్ జిల్లా దుగ్గొండిలో చోటుచేసుకుంది. ప్రస్తుతం బాలిక వరంగల్‌లోని ఎంజీఎం ఆసుపత్రిలో వైద్యుల పర్యవేక్షణలో చికిత్స పొందుతోంది.వివరాల ప్రకారం.. దుగ్గొండికి చెందిన బాలిక నల్లబెల్లి హాస్టల్‌లో ఉంటూ తొమ్మిదో తరగతి చదువుతోంది. ఈ నెల 24వ తేదీన ఇంటికి వచ్చిన బాలికను నర్సంపేటకు చెందిన ముగ్గురు యువకులు ప్రేమించాలంటూ వేధించినట్లు సమాచారం.యువకుల వేధింపులతో తీవ్ర మనస్తాపానికి గురైన బాలిక అర్ధరాత్రి ఇంట్లో పురుగుల మందు తాగినట్లు తెలిసింది. ఇది గమనించిన తల్లిదండ్రులు వెంటనే ఆమెను వరంగల్‌లోని ఎంజీఎం ఆసుపత్రికి తరలించారు. ప్రస్తుతం వైద్యులు బాలికకు చికిత్స అందిస్తున్నారు.బాలిక తండ్రి ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. బాలికను వేధించినట్లు ఆరోపణలు ఎదుర్కొంటున్న యువకుల వివరాలు, ఘటనకు సంబంధించిన ఇతర అంశాలపై పోలీసులు విచారణ కొనసాగిస్తున్నారు.

హనుమకొండ జిల్లాలో 1.20 లక్షల మంది మహిళలకు చీరల పంపిణీ

హనుమకొండ, నవంబర్ 27 (ప్రజానేస్తం జ్వాల):



ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న ఇందిరమ్మ మహిళా శక్తి పథకం కింద హనుమకొండ జిల్లాలోని 12 మండలాల పరిధిలో 1.20 లక్షల మంది స్వయం సహాయక సంఘాల మహిళా సభ్యులకు చీరలు పంపిణీ చేయనున్నట్లు జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి (డీఆర్‌డీఓ) మేన శ్రీను తెలిపారు.18 ఏళ్లు నిండిన స్వయం సహాయక సంఘాల సభ్యులైన మహిళలకు నాణ్యమైన చిలకపచ్చ రంగు చీరలను అందించనున్నట్లు ఆయన వెల్లడించారు. జిల్లాలో మొత్తం 1.20 లక్షల మంది మహిళలను లబ్ధిదారులుగా గుర్తించగా, పంపిణీ కోసం ముందస్తుగా 1.50 లక్షల చీరలు జిల్లాకు చేరుకున్నాయని వివరించారు.సెర్ప్ ముఖ్య కార్యనిర్వహణ అధికారి, హనుమకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్‌పాయ్ ఆదేశాల మేరకు పంపిణీ ఏర్పాట్లు చేపడుతున్నట్లు మేన శ్రీను పేర్కొన్నారు. త్వరలోనే జిల్లాలోని అన్ని మండలాల్లో చీరల పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభించనున్నట్లు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో ఐనవోలు యువకుడు మృతి.. సోదరుడికి తీవ్ర గాయాలు

- **ప్రమాద స్థలంలో వీధి దీపాలు లేకపోవడంపై బంధువుల ఆందోళన**

హనుమకొండ, నవంబర్ 27 (ప్రజానేస్తం జ్వాల):



ఉపాధి కోసం రంగులద్దే పనికి వెళ్లిన ఓ యువకుడు ఇంటికి తిరిగి వస్తుండగా రోడ్డు ప్రమాదంలో ప్రాణాలు కోల్పోయిన ఘటన హనుమకొండ జిల్లా ఐనవోలులో విషాదం నింపింది. ఈ ప్రమాదంలో మరో యువకుడు తీవ్రంగా గాయపడ్డాడు.వివరాల ప్రకారం.. ఐనవోలుకు చెందిన శ్రీకాంత్ (26) తన సోదరుడు ప్రణయ్‌తో కలిసి పనులు ముగించుకుని ద్విచక్రవాహనంపై ఇంటికి తిరిగి వస్తున్నాడు. ఈ క్రమంలో పున్నేల్ క్రాస్ సమీపంలో ఎదురుగా వచ్చిన మరో ద్విచక్రవాహనం వారి వాహనాన్ని ఢీకొట్టింది.ఈ ప్రమాదంలో శ్రీకాంత్ తీవ్రంగా గాయపడి అక్కడికక్కడే మృతి చెందినట్లు సమాచారం. అతని సోదరుడు ప్రణయ్ తీవ్ర గాయాలపాలవడంతో ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు.ప్రమాదం జరిగిన ప్రాంతంలో వీధి దీపాలు లేకపోవడంపై మృతుడి బంధువులు ఆందోళన వ్యక్తం చేశారు. రహదారిపై తగిన వెలుతురు ఉండేలా సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవాలని కోరారు. యువకుడి మృతితో కుటుంబ సభ్యులు, బంధువులు విషాదంలో మునిగిపోయారు.

కమలాపూర్‌లో 8 దళిత కుటుంబాలకు విముక్తి.. 14 ఏళ్లుగా కొనసాగుతున్న పనుల వ్యవహారంపై అధికారుల విచారణ

- **అప్ప పేరుతో నిర్బంధంగా పనులు చేయిస్తున్నారనే ఫిర్యాదు.. ఫ్యాక్టరీలో అధికారుల తనిఖీలు**

హనుమకొండ, నవంబర్ 27 (ప్రజానేస్తం జ్వాల):



హనుమకొండ జిల్లా కమలాపూర్ మండల పరిధిలోని ఓ సిమెంట్ ఇటుకల తయారీ కర్మాగారంలో ఎనిమిది దళిత కుటుంబాలు దీర్ఘకాలంగా నిర్బంధ పరిస్థితుల్లో పనిచేస్తున్నాయనే ఫిర్యాదు వెలుగులోకి వచ్చింది. నెల్లూరు జిల్లాకు చెందిన ఈ కుటుంబాలు అప్పు పేరుతో సుమారు 14 ఏళ్లుగా అక్కడే పనిచేస్తున్నట్లు అధికారులకు సమాచారం అందింది.కుటుంబానికి వారానికి కేవలం రూ.600 మాత్రమే చెల్లిస్తూ పనులు చేయిస్తున్నారని, కుటుంబాల్లోని చిన్నారులతోనూ పనులు చేయిస్తున్నారని ఓ స్వచ్ఛంద సంస్థ ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేసినట్లు తెలిసింది.ఈ ఫిర్యాదుపై స్పందించిన అధికారులు సదరు కర్మాగారంలో ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. అక్కడ పనిచేస్తున్న ఎనిమిది కుటుంబాల పరిస్థితిని పరిశీలించి, వారిని పని నుంచి విముక్తి కల్పించినట్లు సమాచారం. అనంతరం బాధిత కుటుంబాలను పునరావాస చర్యల నిమిత్తం కమలాపూర్ తహసీల్దార్ కార్యాలయానికి తరలించారు.ఈ ఘటనకు సంబంధించి అప్పు పేరుతో నిర్బంధంగా పనులు చేయించారనే ఫిర్యాదులోని అంశాలపై అధికారులు విచారణ చేపట్టాల్సి ఉంది. బాధిత కుటుంబాలకు అవసరమైన పునరావాస సహాయం అందించే దిశగా చర్యలు తీసుకుంటున్నారు.

విద్యార్థుల విద్యా సామర్థ్యాల పెంపుపై ప్రత్యేక దృష్టి పెట్టాలి

- **పాఠశాలల్లో ప్రతిరోజూ గంటపాటు ప్రత్యేక బోధనా తరగతులు నిర్వహించాలి**
- **జిల్లా విద్యాశాఖ సమీక్షలో కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ ఆదేశాలు**

సూర్యాపేట, నవంబర్ 27 (ప్రజానేస్తం జ్వాల):



ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల విద్యా సామర్థ్యాలను మెరుగుపరిచేందుకు ప్రత్యేక చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ విద్యాశాఖ అధికారులను ఆదేశించారు. శుక్రవారం జిల్లా కలెక్టరేట్‌లో మండల విద్యాధికారులు, పాఠశాలల సముదాయ ప్రధానోపాధ్యాయులతో జిల్లా విద్యాశాఖ ఆధ్వర్యంలో సమీక్ష సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ తెలుగు, గణితం, ఆంగ్లం సబ్జెక్టుల్లో వెనుకబడిన విద్యార్థులపై ఉపాధ్యాయులు ప్రత్యేక శ్రద్ధ చూపాలని సూచించారు. విద్యార్థుల అభ్యసన సామర్థ్యాలను పెంపొందించేందుకు ప్రతిరోజూ గంటపాటు ప్రత్యేక బోధనా తరగతులు నిర్వహించాలని ఆదేశించారు. ఈ నెలలో పది ప్రాథమిక అక్షరాస్యత, సంఖ్యాజ్ఞాన సామర్థ్య పాఠశాలలను సందర్శించకపోవడంపై అధికారులను వివరణ కోరారు. వెంటనే పాఠశాలల సందర్శనలు పూర్తి చేయాలని ఆదేశించారు. సందర్శనల్లో మంచి పనితీరు కనబరిచిన కందిబండ ప్రాథమిక పాఠశాలను అభినందించారు.పదో తరగతి సమ్మేటివ్-1 పరీక్షల ఫలితాల్లో అన్ని సబ్జెక్టులతో పాటు గణితంలోనూ వెనుకబడిన 31 పాఠశాలలపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. ఆయా సబ్జెక్టుల నిపుణుల సేవలను వినియోగించుకుని విద్యార్థుల ఫలితాలను మెరుగుపరచాలని మండల విద్యాధికారులు, పాఠశాలల సముదాయ ప్రధానోపాధ్యాయులను ఆదేశించారు.ప్రతిరోజూ ముఖ గుర్తింపు ఆధారిత హాజరును పర్యవేక్షిస్తూ 90 శాతానికి పైగా విద్యార్థుల హాజరు నమోదయ్యేలా చూడాలని తెలిపారు. ప్రీ ప్రైమరీలో విద్యార్థుల నమోదు పెంచాలని, ప్రత్యేక అవసరాలున్న పిల్లల కోసం చేపట్టిన భవన నిర్మాణాలను త్వరగా పూర్తి చేయాలని సూచించారు. విద్యార్థుల అపార్ గుర్తింపు సంఖ్యల నమోదును కూడా వేగవంతం చేయాలని ఆదేశించారు.పీఎం శ్రీ, సమగ్ర శిక్ష, పీఎం పోషణ పథకాల నిధులను నిబంధనల ప్రకారం సక్రమంగా వినియోగించాలని కలెక్టర్ తెలిపారు. ఖాన్ అకాడమీ, ఫిజిక్స్ వాలా, ఏఎక్స్‌ఎల్ ల్యాబ్స్ కార్యక్రమాల పనితీరును మెరుగుపరచాలని సూచించారు. పాఠశాలల్లో మాదకద్రవ్య రహిత వాతావరణం కల్పించేందుకు అధికారులు, ఉపాధ్యాయులు సమష్టిగా కృషి చేయాలని అన్నారు. మధ్యాహ్న భోజన పథకం డ్యాష్‌బోర్డును ప్రతి వారం పర్యవేక్షించాలని ఆదేశించారు. స్పర్శ్ బిల్లుల ఆమోదంలో ఎదురవుతున్న సమస్యలను జిల్లా ఖజానా అధికారిని సమావేశానికి ఆహ్వానించి పరిష్కరించారు.ఈ సమావేశంలో జిల్లా విద్యాశాఖ సమన్వయకర్తలు వై. రాంబాబు, శ్రవణ్, ఈ. హరికృష్ణ, టీ. పూలన్, సూర్యనారాయణ, పర్యవేక్షక అధికారి మోహన్, ప్రాథమిక అక్షరాస్యత, సంఖ్యాజ్ఞాన విభాగం సభ్యులు, మండల విద్యాధికారులు, పాఠశాలల సముదాయ ప్రధానోపాధ్యాయులు, జిల్లా విద్యాశాఖ అధికారి కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

నవోదయ ప్రవేశ పరీక్షకు సర్వం సిద్ధం.. ఉమ్మడి వరంగల్ జిల్లాలో 27 కేంద్రాలు

- **5,313 మంది విద్యార్థులు హాజరు.. రేపు ఉదయం 11:30 నుంచి పరీక్ష**

హనుమకొండ, నవంబర్ 27 (ప్రజానేస్తం జ్వాల):



జవహర్ నవోదయ విద్యాలయంలో ఆరో తరగతి ప్రవేశాల కోసం శనివారం (నవంబర్ 28) నిర్వహించనున్న ప్రవేశ పరీక్షకు అన్ని ఏర్పాట్లు పూర్తయ్యాయని మామునూరు నవోదయ విద్యాలయ ప్రిన్సిపాల్ టీ. రమేష్ తెలిపారు. పరీక్ష నిర్వహణ కోసం ఉమ్మడి వరంగల్ జిల్లా వ్యాప్తంగా మొత్తం 27 పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు ఆయన ఒక ప్రకటనలో వెల్లడించారు.ఈ ప్రవేశ పరీక్షకు ఉమ్మడి వరంగల్ జిల్లా నుంచి మొత్తం 5,313 మంది విద్యార్థులు హాజరుకానున్నారు. వీరిలో 3,159 మంది బాలురు, 2,154 మంది బాలికలు ఉన్నట్లు ప్రిన్సిపాల్ వివరించారు. శనివారం ఉదయం 11:30 గంటల నుంచి మధ్యాహ్నం 1:30 గంటల వరకు పరీక్ష నిర్వహించనున్నట్లు తెలిపారు. అభ్యర్థులు పరీక్ష ప్రారంభ సమయానికి ముందుగానే తమకు కేటాయించిన కేంద్రాలకు చేరుకోవాలని సూచించారు. పరీక్షను ప్రశాంతంగా, సజావుగా నిర్వహించేందుకు విద్యార్థులు, తల్లిదండ్రులు సహకరించాలని కోరారు.

వాట్సాప్ వినియోగదారులకు సీఈఆర్టీ హెచ్చరిక.. వెంటనే యాప్‌ను అప్‌డేట్ చేసుకోండి

- **భద్రతా లోపాలతో వ్యక్తిగత సమాచారం చోరీ అయ్యే ప్రమాదం.. అనుమానాస్పద లింకులపై క్లిక్ చేయవద్దని సూచన**

హనుమకొండ, నవంబర్ 27 (ప్రజానేస్తం జ్వాల):



ప్రముఖ సందేశాల యాప్ వాట్సాప్ వినియోగదారులకు భారత కంప్యూటర్ అత్యవసర స్పందన బృందం (సీఈఆర్టీ-ఇన్) కీలక హెచ్చరిక జారీ చేసింది. వాట్సాప్‌లో గుర్తించిన భద్రతా లోపాలను ఆసరాగా చేసుకుని సైబర్ నేరగాళ్లు ప్రత్యేక సందేశాలు, జతచేసిన ఫైళ్లు లేదా అనుమానాస్పద లింకుల ద్వారా వినియోగదారుల ఫోన్లలో హానికరమైన కోడ్‌ను అమలు చేసే అవకాశం ఉందని హెచ్చరించింది. దీనివల్ల వ్యక్తిగత, సున్నితమైన సమాచారం చోరీకి గురయ్యే ప్రమాదం ఉందని తెలిపింది.ఈ భద్రతా ముప్పు ఆండ్రాయిడ్, ఐఓఎస్, విండోస్, మ్యాక్ పరికరాలను ఉపయోగించే వారికీ ఉండవచ్చని పేర్కొంది. ఆండ్రాయిడ్ వినియోగదారులు వాట్సాప్‌ను 2.26.35.74 లేదా అంతకంటే పై సంస్కరణకు వెంటనే అప్‌డేట్ చేసుకోవాలని సూచించింది. అలాగే తెలియని నంబర్ల నుంచి వచ్చే అనుమానాస్పద సందేశాలు, లింకులు, ఫైళ్లను తెరవకుండా జాగ్రత్త వహించాలని అధికారులు సూచించారు. వాట్సాప్‌ను ఎప్పటికప్పుడు తాజా సంస్కరణకు అప్‌డేట్ చేసుకోవడం, అనుమానాస్పద లింకుల పట్ల అప్రమత్తంగా ఉండటం ద్వారా సైబర్ ముప్పుల నుంచి వ్యక్తిగత సమాచారాన్ని కాపాడుకోవచ్చని సూచించారు.

తిరుమల వైకుంఠ ద్వార దర్శన టికెట్ల షెడ్యూల్ విడుదల

- **రేపటి నుంచి శ్రీవాణి టికెట్ల బుకింగ్ ప్రారంభం.. రూ.300 ప్రత్యేక ప్రవేశ దర్శన టికెట్లు నవంబర్ 30న విడుదల**

హనుమకొండ, నవంబర్ 27 (ప్రజానేస్తం జ్వాల):



తిరుమల శ్రీవేంకటేశ్వర స్వామివారి వైకుంఠ ద్వార దర్శనాల కోసం ఎదురుచూస్తున్న భక్తులకు తిరుమల తిరుపతి దేవస్థానం (టీటీడీ) కీలక సమాచారం వెల్లడించింది. డిసెంబర్ 20 నుంచి 29వ తేదీ వరకు నిర్వహించనున్న వైకుంఠ ద్వార దర్శనాలకు సంబంధించిన టికెట్లు, దర్శన టోకెన్ల విడుదల షెడ్యూల్‌ను ప్రకటించింది.షెడ్యూల్ ప్రకారం నవంబర్ 28న ఉదయం 10 గంటలకు శ్రీవాణి దర్శన టికెట్లను ఆన్‌లైన్‌లో విడుదల చేయనున్నారు. నవంబర్ 30న ఉదయం 10 గంటలకు రూ.300 ప్రత్యేక ప్రవేశ దర్శన టికెట్లు అందుబాటులోకి రానున్నాయి.వైకుంఠ ఏకాదశి, ద్వాదశి తొలి రెండు రోజులకు సంబంధించిన స్లాటెడ్ సర్వదర్శనం టోకెన్ల కోసం డిసెంబర్ 1 నుంచి 5వ తేదీ వరకు ఆన్‌లైన్‌లో ఈ-డిప్ నమోదు ప్రక్రియ కొనసాగనుంది. డిసెంబర్ 7న మధ్యాహ్నం 3 గంటలకు ఈ-డిప్ ద్వారా టోకెన్ల కేటాయింపు చేపట్టనున్నట్లు టీటీడీ వెల్లడించింది.భక్తులు నిర్దేశిత తేదీలు, సమయాలను గమనించి అధికారిక టీటీడీ వెబ్‌సైట్ ద్వారానే టికెట్లు, టోకెన్ల కోసం నమోదు చేసుకోవాలని సూచించారు.

తెలంగాణ భూగర్భ జల శాఖ వెబ్‌సైట్ హ్యాక్ కలకలం.. అడల్ట్ సైట్‌కు మళ్లింపు

- **వెబ్‌సైట్‌లో మాల్‌వేర్ ప్రవేశించినట్లు అనుమానాలు.. పునరుద్ధరణకు అధికారుల చర్యలు**

హనుమకొండ, నవంబర్ 27 (ప్రజానేస్తం జ్వాల):



తెలంగాణ రాష్ట్ర భూగర్భ జల శాఖ అధికారిక వెబ్‌సైట్ హ్యాకింగ్‌కు గురైందనే అనుమానాలు కలకలం రేపుతున్నాయి. గురువారం నుంచి ఆ వెబ్‌సైట్ లింక్‌ను తెరిచినప్పుడు మరో వెబ్‌సైట్‌కు, అందులోనూ అనుచితమైన విషయాలు ఉన్న పేజీకి మళ్లింపు జరుగుతోందని నెటిజన్లు సామాజిక మాధ్యమం 'ఎక్స్' వేదికగా ఫిర్యాదులు చేశారు.అంతేకాకుండా, వెబ్‌సైట్ పేరుతో శోధన యంత్రాల్లోనూ అనుచిత పదాలు కనిపిస్తున్నాయని పలువురు ఆందోళన వ్యక్తం చేశారు. వెబ్‌సైట్‌లోకి హానికరమైన సాఫ్ట్‌వేర్ ప్రవేశించి ఉండవచ్చని సాంకేతిక నిపుణులు, అధికారులు అనుమానిస్తున్నారు. ఈ విషయంపై సమాచారం అందుకున్న ఐటీ విభాగం అధికారులు అప్రమత్తమయ్యారు. వెబ్‌సైట్‌లో తలెత్తిన సమస్యను గుర్తించి, దాన్ని తిరిగి సాధారణ స్థితికి తీసుకురావడానికి చర్యలు చేపట్టినట్లు సమాచారం. ప్రభుత్వ శాఖకు చెందిన అధికారిక వెబ్‌సైట్‌లో ఇలాంటి ఘటన చోటుచేసుకోవడంపై నెటిజన్లు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

తపాలా శాఖ ఆధునికీకరణకు కేంద్రం రూ.2,632 కోట్ల కేటాయింపు

హనుమకొండ, నవంబర్ 27 (ప్రజానేస్తం జ్వాల):

భారతీయ తపాలా వ్యవస్థను ఆధునికీకరించి ప్రజలకు మరింత వేగవంతమైన, మెరుగైన సేవలు అందించేందుకు కేంద్ర ప్రభుత్వం రూ.2,632 కోట్ల నిధులను కేటాయించింది. 2026-27 ఆర్థిక సంవత్సరం నుంచి 2030-31 వరకు ఐదేళ్లపాటు ఈ నిధులను దశలవారీగా వినియోగించనున్నట్లు కేంద్ర మంత్రి జ్యోతిరాదిత్య సింధియా వెల్లడించారు.తపాలా శాఖను సంప్రదాయ సేవలకే పరిమితం చేయకుండా ఆదాయాన్ని పెంచే సంస్థగా అభివృద్ధి చేయడమే లక్ష్యంగా కేంద్రం చర్యలు చేపడుతోందని మంత్రి తెలిపారు. ఇందులో భాగంగా కొత్త పోస్టాఫీసుల నిర్మాణం, ఇప్పటికే ఉన్న కార్యాలయాల్లో మౌలిక సదుపాయాల మెరుగుదల, పార్శిల్ సేవల విస్తరణపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నట్లు పేర్కొన్నారు.తపాలా శాఖ ఆదాయంలో వృద్ధి నమోదవుతోందని, ముఖ్యంగా పార్శిల్ విభాగం 71 శాతం వృద్ధిని సాధించిందని మంత్రి వెల్లడించారు. దేశవ్యాప్తంగా పోస్టాఫీసులను ఆధునిక సదుపాయాలతో అభివృద్ధి చేసి, ప్రజలకు మరింత సమర్థవంతమైన సేవలు అందించడమే ఈ నిధుల కేటాయింపు ప్రధాన ఉద్దేశమని తెలిపారు.కేంద్ర ప్రభుత్వం చేపట్టనున్న ఈ ఆధునికీకరణ చర్యలతో తపాలా సేవల సామర్థ్యం పెరగడంతో పాటు పార్శిల్ రవాణా రంగంలోనూ మరింత విస్తరణకు అవకాశం ఏర్పడనుంది.

